జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php




సంపుటి 12 సంచిక 208 విశాఖపట్నం | గురువారం 15 ఏప్రిల్ 2021 | 8 పేజీలు | వెల : 5.00

## అంబేద్కర్‌కు జగన్ ఘన నివాళి





విజయవాడ, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మేకతోటి సుచరిత, తానేటి వనిత, విశ్వరూప్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే మేరుగు నాగార్జున తదితరులు పాల్గొన్నారు. నవభారత వికాసానికి బాటలు వేసిన దార్శనికుడు అంబేద్కర్ అని సీఎం వైఎస్ జగన్ కొనియాడారు. "సర్వసమానత్వానికి కృషి చేసిన కారణజన్ముడు అంబేద్కర్. అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని అందించిన మహోన్నతుడు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నిండు మనసుతో నివాళి అర్పిస్తున్నానని" సీఎం పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. దేశానికి అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు.








అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ట్యాంక్ బండ్ పై గల అంబేద్కర్ విగ్రహాన్ని పూలమాలలతో ఘన నివాళులు అర్పించిన బహుజన నాయకులు, చిత్రం లో స్నేహా సంస్థల చైర్మన్ కటికల శివ భాగ్యారావు ఐఆర్ఎస్.విఆర్ఎస్, మాస్టర్ కీ ఛానల్ డైరెక్టర్ లు ఆరేపల్లి రాజేందర్,శ్యామ్ ప్రసాద్, లోక్ జనశక్తి పార్టీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇనుగాల భీంరావు తదితర బహుజన నాయకులు..

## పాదయాత్రలో పేదల కష్టాలు చూశా:డా.గురుమూర్తి

**శ్రీకాళహస్తిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ...**



చిత్తూరు, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి:అప్పట్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి పాదయాత్ర చేసే భాగ్యం తనకు దక్కిందని తిరుపతి లోక్‌సభ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డా. గురుమూర్తి అన్నారు. పాదయాత్రలో అడుగడుగునా పేదల కష్టాలు చూశానన్నారు. బుధవారం శ్రీకాళహస్తిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన బహిరంగ సభకు భారీ సంఖ్యలో జనం తరలి వచ్చారు. ఈ సభలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. వెంకటగిరిలో నేత కార్మికుల కష్టాలు చూసి సీఎం వైఎస్ జగన్ చలించిపోయారని గుర్తు చేసుకున్నారు. నేతన్నలకు ఆర్థిక సహాయం చేయడానికి ఆయన ఆనాడే పూనుకున్నారని, కానీ దీన్ని తెలుగుదేశం తప్పుపట్టిందని మండిపడ్డారు.

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. సొంత జిల్లా చిత్తూరును అభివృద్ధి చేయలేని చంద్రబాబుకు కనీసం చెప్పుకోవడానికి ఒక్కటి కూడా లేదని ఎద్దేవా చేశారు. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో బాబు కొత్త డ్రామాలకు తెర లేపారని దుయ్యబట్టారు. కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఇంతగా సంక్షేమ పథకాలు జరుగుతున్నాయా? అని ప్రశ్నించారు. తిరుపతి ఉప ఎన్నికల ప్రచారంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని మండిపడ్డారు.

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ గురుమూర్తి మంచి విద్యావేత్త అని, అందుకే ఈయనకు సీఎం జగన్ ఎంపీ టికెట్ ఇచ్చారని అన్నారు. 17వ తారీఖున సంపన్నులకు పేదవాడికి జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ.. పేద కుటుంబం నుంచి వచ్చిన డాక్టర్ గురుమూర్తిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## కోవిడ్-19 ఎఫెక్ట్ మహారాష్ట్రలో కిక్కిరిసిన రైల్వే స్టేషన్లు



ముంబై,ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: కోవిడ్-19 వ్యాప్తిని అరికట్టడానికి మహారాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల పాటు జనతా కర్ఫ్యూ విధించింది. ముంబయి మహానగరంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వివిధ పనులు చేస్తున్న వాళ్లు సొంతూళ్లు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దింతో నగరంలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు జనాలతో కిక్కిరిసిపోతున్నాయి. లోక్‌మన్య తిలక్ టెర్మినస్ వెలుపల చాలా మంది రైళ్లలో ఎక్కడానికి గుమిగూడారు. భారీ సంఖ్యలో ప్రయాణికులు అక్కడకు చేరుకోవడంతో రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ లోక్‌మన్య తిలక్ టెర్మినస్(ఎల్టిటి) వెలుపల అదనపు బలగాలను మోహరించాల్సి వచ్చింది. అత్యవసర సేవలు మినయించి బుధవారం రాత్రి 8 గంటల నుంచి మే 1వ తేదీ ఉదయం 7 గంటల వరకు 15 రోజుల పాటు జనతా కర్ఫ్యూ నిబంధనలు అమలులో ఉంటాయి. జనతా కర్ఫ్యూలో భాగంగా రాష్ట్రమంతటా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయట తిరగడానికి వీల్లేదని అధికారులు తెలుపుతున్నారు. దుకాణాలను, బహిరంగ ప్రదేశాలను మూసివేయనున్నారు. అయితే ఆసుపత్రులు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, ఔషధ దుకాణాలు, వ్యాక్సినేషన్ కేంద్రాలు వంటి అత్యవసర సేవలపై ఎలాంటి నిబంధనలు విధించలేదు.

## ఏపీలో షెడ్యూల్ ప్రకారమే టెన్త్, ఇంటర్ పరీక్షలు

అమరావతి,ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: ఏపీలో షెడ్యూల్ ప్రకారమే టెన్త్, ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. సీబీఎస్ఈ పరీక్షలు రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవటంతో రాష్ట్రంలో పరిస్థితిపై ఆయన ఆరా తీశారు. అన్ని పాఠశాలల్లో కోవిడ్ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. విద్యార్థులకు కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తూ ప్రతిరోజూ పరిస్థితిని సమీక్షిస్తున్నామన్నారు. మున్ముందు కోవిడ్ కేసులు పెరిగితే అప్పుడు పరీక్షల నిర్వహణపై ఆలోచిస్తామని చెప్పారు. కోవిడ్ నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి జగన్‌తో సమీక్ష జరిపి పరీక్షల నిర్వహణపై చర్చిస్తామన్నారు. ఇప్పటికయితే యథావిధిగా షెడ్యూల్ ప్రకారమే అన్ని పరీక్షలు జరిపే ఆలోచనలో ఉన్నామని ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు.

## పిచ్చి చేష్టలను లోకేశ్ మానుకోవాలి:మంత్రి కన్నబాబు



తిరుపతి,ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: టీడీపీ నాయకుడు నారా లోకేశ్ తిరుపతిలో చేసిన ప్రమాణం, సవాల్ పై మంత్రి కన్నబాబు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుర్ర తక్కువ మాటలు, పిచ్చి చేష్టలను లోకేశ్ మానుకోవాలని మంత్రి కన్నబాబు సూచించారు. తమరు ప్రమాణం చేయాల్సి వస్తే.. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడవలేదు అని తమరు ప్రమాణం చేయాలని కన్నబాబు ఎద్దేవా చేశారు. తనకు పిల్లను ఇచ్చిన మామ ఇంట్లో కాల్పులు జరుగలేదని, ఎవరినీ రక్తసిక్తం చేయలేదని అని తమరు ప్రమాణం చేయాలని కన్నబాబు ప్రశ్నించారు. గోదావరి పుష్కరాల మరణాలకు తన తండ్రి చంద్రబాబు కారణం కాదని ప్రమాణం చేయాలని ఆయన సవాల్ విసిరారు. తమరిని మాస్ హీరోగా చూపించాలని శిక్షణ ఇస్తున్నట్టు ఉన్నారని మంత్రి కన్నబాబు ఎద్దేవా చేశారు. జగన్ సోదరీమణుల గురించి మాట్లాడుతున్నారు.. తమరికి సంస్కారం ఉందా అని ఆయన ప్రశ్నించారు. తాడిపల్లెలోని జగన్ ఇంటికి రండి.. అది ప్యాలెసా, మామూలు ఇల్లో చూడాలని లోకేష్‌కు ఆయన సవాల్ విసిరారు. అలాగే తమరికి ఇంటికి వస్తాం. అది ప్యాలెస్సా, మామూలు ఇల్లా చూద్దామని నారా లోకేశ్ మంత్రి కన్నబాబు సవాల్ విసిరారు.

## సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్షలు రద్దు, 12వ తరగతి పరీక్షలు వాయిదా



న్యూఢిల్లీ,ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలు రద్దు చేసింది. 12వ తరగతి పరీక్షలను వాయిదా వేసింది. పదో తరగతి ఫలితాలను బోర్డు తయారు చేయబోయే కొన్ని ప్రమాణాల ఆధారంగా సిద్ధం చేయనున్నట్లు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ వెల్లడించింది.ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షలను రద్దు చేయాలన్న డిమాండ్ల నేపథ్యంలో ఉన్నతాధికారులతో ప్రధాని మోదీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే పదో తరగతి పరీక్షలను రద్దు చేయాలన్న కీలక నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ నేతలు రాహుల్, ప్రియాంకా గాంధీలతోపాటు ఆప్ చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.జూన్ 1న బోర్డు అప్పటి పరిస్థితులను సమీక్షించి 12వ తరగతి పరీక్షలను తర్వాత నిర్వహించాలని నిర్ణయించారు. 12 తరగతి పరీక్షలు మే 4 నుంచి జూన్ 14 వరకూ జరగాల్సి ఉండగా.. ఇప్పుడవి వాయిదా పడ్డాయి. పరీక్షలు తిరిగి నిర్వహించే ముందు కనీసం 15 రోజులు ముందు నోటీసు ఇవ్వనున్నారు.ఇంటెర్నల్ అసెస్‌మెంట్ ఆధారంగా పదో తరగతి విద్యార్థులను ప్రమోట్ చేస్తామని విద్యా శాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ వెల్లడించారు. ఒకవేళ ఎవరైనా విద్యార్థి అసెస్‌మెంట్‌పై అసంతృప్తిగా ఉంటే ఆమె/అతడు పరిస్థితులు మెరుగుపడిన తర్వాత పరీక్షలు రాయవచ్చని కూడా ఆయన చెప్పారు.



# ప్రజలను మోసం చేసింది బీజేపీ,చంద్రబాబు:కొడాలి నాని

చిత్తూరు, సత్యవేడు ప్రజాపాలనప్రతినిధి : రాష్ట్రానికి ప్రత్యేక హెూదాను నీరుగార్చిన నిష్ట దరిద్రుడు చంద్రబాబునాయుడు అని రాష్ట్ర పౌరసరఫరాలు , వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు ( నాని ) విమర్శించారు . తిరుపతి ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి , ఎంపీ గోరంట్ల మాధవ్ , ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి , ఎమ్మెల్సీ సునీత , ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం , మాజీ ఎమ్మెల్యే ఎస్ సీవీ నాయుడు , ఎంపీ అభ్యర్థి డాక్టర్ గురుమూర్తితో కలిసి సత్యవేడు నియోజకవర్గంలో జరిగిన సభల్లో మంత్రి కొడాలి నాని మాట్లాడారు . తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికలను తిరుమల శ్రీవారు చూస్తున్నారన్నారు . శ్రీవారి పాదాల దగ్గర ఒకే వేదికపై ప్రధాని నరేంద్రమోదీ , గతంలో ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు , బీజేపీకి మద్దతిస్తున్న పవన్ కళ్యాణ్ లు ఈ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా తీసుకువచ్చే బాధ్యత మాదని , ప్రజలంతా తమకు ఓటెయ్యాలని శ్రీవారిని , ప్రజలను నమ్మించి ప్రధాని , ముఖ్యమంత్రులయ్యారన్నారు . ప్రధాని అయిన తర్వాత రాష్ట్రానికి ప్యాకేజ్ ఇస్తానని , ప్రత్యేక హెూదా ఇవ్వడం కుదరదని మోదీ చెప్పారన్నారు .

దొంగ చంద్రబాబు కూడా ప్రత్యేక హెూదా కన్నా ప్రత్యేక ప్యాకేజ్ వల్ల ప్రయోజనం ఉంటుందని , ప్రజలంతా తన మాట వినాలని కోరాడన్నారు . గత ఎన్నికలకు ముందు ప్రధాని మోదీని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడన్నారు . ఎన్నికల తర్వాత మోదీని విమర్శిస్తే జైల్లో పెడతారని భయపడి నక్కలా ఇక్కడే తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేసే తప్పులను కూడా సీఎం జగన్ పై రుద్దే ప్రయత్నం చేస్తున్నాడన్నారు . పనబాక లక్ష్మిని గెల్పిస్తే పెట్రోల్ , డీజిల్ ధరలు తగ్గుతాయని అంటున్నాడన్నారు . ధరల పెరుగుదల పేరుతో చంద్రబాబు , లోకేషన్లు చెబుతున్న దానికి , రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నారు . ప్రజలు అమాయకులనే భ్రమలోనే ఉంటున్నారన్నారు . చెత్త పేపర్లు , డబ్బా మీడియాల్లో ఏది చెప్తే అది ప్రజలు నమ్ముతున్నారనే భ్రాంతిలో గడుపుతున్నారన్నారు . రాష్ట్రంలో చంద్రబాబును మించిన తెలివితేటలు అందరికీ ఉన్నాయన్నారు . చంద్రబాబు టైం అయిపోయిందని అన్నారు . ఎన్టీఆర్ కు ఒకసారి వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయ్యావని , వాజ్ పేయి దయ వల్ల ఇంకోసారి , 2014 లో నరేంద్రమోదీ , పవన్ కళ్యాణ్ లు కాళ్ళు పట్టుకుని మరోసారి ముఖ్యమంత్రి అయ్యాడన్నారు . ప్రజల మద్దతు , సహకారంతో ఒక్కసారి కూడా చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన పరిస్థితి లేదన్నారు . చంద్రబాబును పిచ్చోడి కింద భావిస్తూ నవ్వుకునే పరిస్థితి ఉందన్నారు .ఇంకా ఈ కార్యక్రమంలో వై సి పి నాయకులూ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .



## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారతదేశపు గొప్ప వారసుడు:ఏపి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్

విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి: భరత్ రత్న బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ 130 వ జయంతి సందర్భంగా రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.గవర్నర్ మాట్లాడుతూ బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ ఆర్థికవేత్త, న్యాయవాది, రాజకీయవేత్త మరియు సామాజిక సంస్కర్త, దళితుల పట్ల సామాజిక వివక్షకు వ్యతిరేకంగా అవిశ్రాంతంగా పోరాడి, దళిత సమాజం ఎదుర్కొంటున్న అన్యాయం, వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా గొంతు పెంచారన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగ పితామహుడు మాత్రమే కాదు, రాజ్యాంగ ముసాయిదా యొక్క ముఖ్య వాస్తుశిల్పి కూడా అన్నారు . డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దళితుల హక్కుల కోసం మరియు సమాజంలోని అణగారిన వర్గాల విముక్తి కోసం పోరాడిన భారతదేశపు గొప్ప కుమారుడు అని అన్నారు.

## వృద్ధ నేతలను పక్కన పెట్టడం వల్లనే...

ఒంగోలు, ఏప్రిల్ 14, :ఏపీలో అధికార పార్టీ వైసీపీలో వృద్ధ నేతల పరిస్థితి ఏంటి ? వీరిని సీనియర్లుగా గుర్తించడం లేదా ? ఎలాంటి కీలక పదవులు అప్పగించడం లేదా అంటే.. ఔననే మాటలే వినిపిస్తున్నాయి. నిజానికి పార్టీ పెట్టిన నాటి నుంచి అంటే.. ఈ పదేళ్ల కాలంలో.. పార్టీలో అనేక మంది సీనియర్లు చక్రం తిప్పారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీకి అనుకూలంగా పనిచేశారు. అయితే.. గత ఎన్నికల సమయంలో కొందరికి టికెట్లు కూడా ఇవ్వకుండా ? పక్కన పెట్టారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పదవులు ఇస్తామన్నారు. అయితే.. ఇప్పటి వరకు వీరి ఊసు ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో వీరిని పక్కన పెట్టారని.. అందుకే వీరిని పట్టించుకోవడం లేదని పెద్ద ఎత్తున పార్టీలో చర్చ సాగుతుండడం గమనార్హం.మేకపాటి రాజమోహన్‌రెడ్డి, దాడి వీరభద్రరావు, గాదె వెంకటరెడ్డి.. ఇలా చాలా మంది సీనియర్లు వైసీపీలో ఉన్నారు. ఒకరకంగా వీరితో వయసుతో పోల్చుకుంటే.. ఇంకా ఒకటి రెండేళ్లు ఎక్కువ వయసున్న వారు టీడీపీలో ఇంకా చక్రం తిప్పుతున్నారు. కానీ, వైసీపీలో ఉన్న వారు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. అంటే.. వీరి అవసరం లేదని జగన్ భావిస్తున్నారా ? లేక.. వృద్ధ తరాన్ని కేవలం సలహాలు, సూచనల వరకే పరిమితం చేయాలని అనుకున్నారా ? అనే విషయంలో ఇప్పటికీ క్లారిటీ లేదు. అయితే.. కొందరికి మాత్రం పదవులు ఇచ్చారు. ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చిన రంగనాథరాజు, పరసా రత్నం వంటివారికి మంత్రిగాను, మార్కెట్ యార్డు చైర్మన్‌గాను పదవులు ఇచ్చారు.ఇక, ఇటీవల సీ రామచంద్రయ్యకు ఏకంగా ఎమ్మెల్సీ ఇచ్చారు. మరి మిగిలిన వారి పరిస్థితి ఏంటి ? వైసీపీ అధికారంలోకి వస్తే..తమకు ఏదైనా గుర్తింపు ఉంటుందని తలపోసిన వారి పరిస్థితి ఇప్పుడు అగమ్య గోచరంగా ఉంది. డీఎల్. రవీంద్రారెడ్డి లాంటి వాళ్లు సైతం ఎన్నికలకు ముందు వైసీపీకి సపోర్ట్ చేసి ఏదైనా గుర్తింపు ఉంటుందన్న ఆశతో ఉన్నారు. ఇలాంటి నేతల లిస్ట్ చాలానే ఉన్నా జగన్ పట్టించుకునే పరిస్థితి లేదు. జగన్ పూర్తిగా యువతరం నేతలు.. పూర్తిగా కొత్త ముఖాలనే ఎక్కువుగా నమ్ముకుంటున్నారు. దీంతో వృద్ధతరం నేతల గోడు ఎవ్వరికి పట్టడం లేదు.మరో మూడేళ్ల పాటు మాత్రమే ప్రభుత్వానికి గడువు ఉండడంతో ఏదైనా నామినేటెడ్ పదవి ఇచ్చినా సంతృప్తి వ్యక్తం చేస్తామనే నాయకులు వైసీపీలో కనిపిస్తున్నారు. పోనీ.. వారు ఇచ్చే సలహాలు తీసుకుంటున్నారా? అంటే.. ఇప్పటికైతే.. ఎక్కడా అలాంటి సూచనలు లేవు. మొత్తంగా చూస్తే.. వైసీపీ అధినేత చాలా వ్యూహాత్మకంగా పార్టీని వృద్ధ వాసనలు రాకుండా చూసుకుంటున్నారనడంలో సందేహం లేదు. ఒక్క పురుష నాయకులకే ఈ సమస్య రాలేదు. చాలా మంది మహిళా నాయకులకు కూడా పార్టీలో వృద్ధాప్య సమస్యలు వున్నాయని అంటున్నారు సీనియర్లు. మరి జగన్ వీరికి ఎలాంటి దారి చూపిస్తారో చూడాలి.

## బొబ్బిలి దెబ్బకు ఎమ్మెల్యేలకు టెన్షన్

విజయనగరం, ఏప్రిల్ 14, :ఏపీలో గత ఎన్నికల్లో వైసీపీ ఏకంగా 151 సీట్లతో అప్రతిహత విజయం నమోదు చేసింది. అయితే వీరిలో చాలా మంది ఎమ్మెల్యేలు రెండేళ్లకే తేలిపోయారు. తమ స్థాయికి తగ్గ పనితీరు కనపర్చడం లో ఘోరంగా విఫలమవుతున్నారు. ఈ లిస్టులోనే విజయనగరం జిల్లా బొబ్బిలి ఎమ్మెల్యే శంభంగి వెంకట చిన అప్పలనాయుడు కూడా చేరిపోయారు. అప్పుడెప్పుడో టీడీపీ ఆవిర్భవించినప్పుడు ఎన్టీఆర్ సీటు ఇవ్వడంతో తొలిసారి ఎమ్మెల్యే అయిన చిన అప్పలనాయుడు చివరిగా 1994లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత మళ్లీ 2019లో జగన్ దయతో వైసీపీ సీటు దక్కించుకుని పాతికేళ్ల తర్వాత మళ్లీ అసెంబ్లీ మెట్లు ఎక్కారు. ఈ గాలిలో కూడా చిన అప్పలనాయుడు స్వల్ప మెజార్టీతో మాత్రమే బొబ్బిలిలో గెలిచారు.అప్పలనాయుడు మంత్రి కాలేకపోయినా ప్రోటెం స్పీకర్‌గా అరుదైన గౌరవం దక్కించుకున్నారు. అయితే ఆయన ఎమ్మెల్యేగా గెలిచి రెండేళ్లు అవుతున్నా? నియోజకవర్గానికి ఎంతో సీనియర్ అయినా కూడా రాజకీయంగా బొబ్బిలిలో వైసీపీ తరపున ఏ మాత్రం పట్టు సాధించలేకపోతున్నారు. ఇటీవల బొబ్బిలి నియోజకవర్గంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ దాదాపుగా 50 శాతం పంచాయతీలు గెలవడమే కాదు? కీలక పంచాయతీల్లో పాగా వేసింది. దీంతో బొబ్బిలి మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వైసీపీ అధిష్టానం అక్కడ మంత్రి బొత్సతో పాటు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు బాధ్యతలు అప్పగించింది.అయినా కూడా బొబ్బిలిలో మొత్తం 31 వార్డుల్లో 11 టీడీపీ ఖాతాలోకి వెళ్లిపోయాయి. చావు తప్పి కన్నులొట్టబోయినట్టుగా వైసీపీ జెండా ఎగరేసింది. బొబ్బిలి రాజులకు ధీటుగా శంబంగి చిన అప్పలనాయుడు దూకుడు ప్రదర్శించలేకపోతున్నారన్న చర్చలు జిల్లా రాజకీయాల్లో వినిపిస్తున్నాయి. త్వరలో జరిగే ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికల్లోనూ ఇదే ఫలితాలు పునరావృతం అయితే శంబంగికి ఇవే చివరి ఎన్నికలు అవుతాయని వైసీపీ వాళ్లే చెపుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై ఇప్పటికే జగన్‌కు వెళ్లిన నివేదికల్లో శంబంగి అప్పలనాయుడుపై బ్యాడ్ రిపోర్టు వెళ్లిందంటున్నారు.ఉత్తరాంధ్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ విజయసాయి సైతం శంబంగి అప్పలనాయుడుతో మీరు మరింత యాక్టివ్‌గా ఉండాలని సూచించినట్టు తెలుస్తోంది. ఏదేమైనా ఇప్పటికే వయస్సు పైబడడంతో రాజకీయంగా యాక్టివ్‌గా ఉండలేకపోతోన్న ఆయనను వచ్చే ఎన్నికల్లో పక్కన పెట్టేయాలని వైసీపీ అధిష్టానమే భావిస్తోంది. శంబంగి అప్పలనాయుడు రాజకీయ జీవితం దాదాపు ముగిసినట్టే అనుకోవాలి.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు







గుంటూరు, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: మిత్రులారా, గుంటూరు జిల్లా,వేమూరు నియోజక వర్గం తురుమెళ్ళ గ్రామం లో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ జరిగి 25 సంవత్సరాలు సిల్వర్ జూబ్లీ వేడుకలకు ప్రొ.కశీం గారు ముఖ్య అతిథి గా,విశిష్ట అతిథులుగా డా.గూడూరు సీతామహాలక్ష్మి పూలే. అంబేద్కర్ రాజ్యాధికార సమితి మెంబర్,పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి,డా.ప్రత్యూష సుబ్బారావు సుబ్బారావు , రాష్ట్ర కన్వీనర్ పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి నుండి..హాజరై ప్రసంగించారు.. తురుమెళ్ల అంబేద్కర్ యూత్ వారు.3 రోజుల పాటు అత్యంత ఘనంగా డా.బాబా సాహెబ్ అంబేద్కర్ 130 వ జయంతి వేడుకలు నిర్వహించారు.

## నాయకులకు నార్కో పరీక్షలు చేయాలి: సీపీఐ నారాయణ



తిరుపతి: అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి దండలు వేసిన వారందరికి నార్కో పరీక్షలు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. 80 శాతం మంది అంబేద్కర్ ఆశయాలపై నమ్మకం లేని వారేనని ఈ నార్కో పరీక్షలలో తేలుతుందని నారాయణ పేర్కొన్నారు. అంబేద్కర్ ఓటు హక్కును కల్పించి ప్రజలకు ఆయుధాన్ని అందించారని ఆయన కొనియాడారు. ఎన్నికలే లేకుండా నేడు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# పాఠాలు నేర్పించిన వకీల్ సాబ్..!



తిరుపతి, ఏప్రిల్ 14, :ఒక సినిమా ఇంత రచ్చ చేస్తుందని ఎవరూ అనుకోరు. బాగుంటే చూస్తారు. లేకుంటే మూడోరోజుకు థియేటర్లలో మూత పడిపోతుంది. గతంలోనూ పవన్ సినిమాలు చాలా వచ్చాయి. హిట్ సినిమాల కంటే ఫ్లాఫ్ చిత్రాలే ఎక్కువ. బ్లాక్ బస్టర్లను వేళ్లమీదనే లెక్కించవచ్చు. అయినా వకీల్ సాబ్ ఒక రేంజ్ లో గందరగోళం సృష్టించింది. ఇంకా కొనసాగుతోంది. దీనిని కల్పితగాథపై ఆధారపడి భావోద్వేగాలతో కూడిన చలనచిత్రంగానే చూడాలి. అంతే తప్ప రాజకీయాలను శాసించి , ఇప్పటికిప్పుడు సమాజంలో మార్పును తెచ్చి పెట్టే ఒక మహోన్నత స్ఫూర్తిగా అంచనా వేయలేం. పాలిటిక్స్ తలరాతలను మార్చేసే టార్చ్ బేరర్ గానూ, దిక్సూచిగానూ తలపోయలేం. అయినా ఫ్యాన్స్ లో ఉండే మంకుపట్టు, పాలి'ట్రిక్స్'లో పబ్లిసిటీ మానియా వెరసి సినిమాకు భలే కలిసొచ్చింది. పవన్ కల్యాణ్ కు మాత్రం ఒక విషయం స్పష్టంగా తెలిసేలా చేసింది ఈ మూవీ. నిజానికి అభిమానులే తెలియచెప్పారు. సినిమా ఉంటేనే తాను స్టార్. లేకుంటే పాలిటిక్స్‌లో కూడా షైనింగ్ ఉండదు.పవన్ కల్యాణ్ రాజకీయ రంగంలో సంచలనాలు ఏమీ సృష్టించలేదు. ఆ విషయానికొస్తే సినిమా రంగంలోనూ లెజెండ్ కాదు. కానీ అతను ఐకాన్. అతనిదొక ప్రత్యేక శైలి. తనదైన ముద్రతో సినీరంగంలో ఒక స్థానాన్ని సంపాదించుకున్న ఆరాధ్య నాయకుడు. కానీ సినిమారంగంపై అతనికి వ్యక్తిగతంగా పెద్ద మక్కువ లేదు. సినిమాలను వదిలేసి రాజకీయాలకే అంకితం కావాలనుకున్నారాయన. లక్షల కొద్దీ ఉన్న తన అభిమానులు జనసైనికులుగా మారిపోతారు. ప్రజల చేత తన నాయకత్వాన్ని ఒప్పిస్తారనుకున్నారు. ఫ్యాన్స్ బలం పార్టీకి బలంగా మారుతుందనుకున్నారు. తన ఆలోచన ఫలించలేదు. పార్టీకి అంతంతమాత్రం ఆదరణే లభించింది. సినిమాలను వదిలేస్తే రెంటికీ చెడ్డ రేవడిగా మారిపోతావని శ్రేయోభిలాషులు హెచ్చరించారు. ఫలితంగా మూడేళ్ల తర్వాత మళ్లీ సినిమా చేశారు. తన స్టామినా ఎక్కడ ఉందో అక్కడ నిరూపించుకున్నారు. అభిమానులు హారతులు పట్టారు. ఆయన ఫ్యాన్స్ లో వైసీపీ, టీడీపీ కార్యకర్తలు కూడా ఉన్నారు. ఫ్యాన్స్ పొలిటికల్ కార్యకర్తలుగా మారరు. తమ హీరో నుంచి వినోదాన్ని ఆశిస్తారు. అంతవరకే ఆ బంధం. రాజకీయాల్లో రాణించాలంటే కేవలం ఫ్యాన్స్ మీదనే ఆధారపడకూడదు. ప్రజలందరినీ ఒప్పించి గెలవగలగాలి. సినిమాకు, పాలిటిక్స్ కు ఉండే తేడా అదే. ఫ్యాన్స్ ను అలరింపచేసినంత సులభంగా, ప్రేక్షకులను ఆనందింప చేసినంత ఈజీగా రాజకీయాలను రక్తి కట్టించలేం.ప్రభువు మనసెరిగి ప్రవర్తించడంలో అధికార యంత్రాంగం చాలా శ్రద్ధగా పనిచేస్తుంది. వకీల్ సాబ్ సినిమా విడుదల అవుతుంటే అదే జరిగింది. ఒక టాలీవుడ్ స్టార్ సినిమాలాగే వదిలేసి ఉండాలి. కానీ రేట్ల పెంపుదల నుంచి అన్నిటిలోనూ ఆంక్షలు పెట్టాలని ప్రభుత్వ అధికారులు ప్రయత్నించారు. ఏలినవారి వద్ద మార్కులు కొట్టేయాలనేది అధికారుల తాపత్రయం. దీంతో వకీల్ సాబ్ కు బోలెడంత పబ్లిసిటీ లభించింది. వివాదాన్ని సృష్టించడం ద్వారా రాంగోపాల్ వర్మ తన సినిమాల వైపు ప్రజలను ఆకర్షిస్తూ ఉంటాడు. జనం ఎగబడతారు. తీరా చూస్తే సినిమాలో సరుకు ఉండదు. అయినా ఈలోపుగానే రావాల్సిన సొమ్ములు వచ్చేస్తాయి. పవన్ కల్యాణ్ సినిమాపై సర్కారీ అధికారులు అనవసర హంగామా చేశారు. సినిమాలో ఏదో సందేశం ఉందని ప్రజలు భావించేలా చేశారు. ఫ్యాన్స్ స్పందనలు, పొలిటికల్ నాయకుల స్టేట్ మెంట్లు, చంద్రబాబు వంటి వారు సైతం తాము వెనకబడి పోకూడదని మద్దతు ప్రకటనలు వెరసి సినిమాకు హైప్ ఇచ్చాయి. సినిమాకు, రాజకీయాలకు మధ్య తేడాను ప్రజలు గుర్తిస్తున్నారు. అభిమానులు సైతం వేరు చేసి చూస్తున్నారు. కానీ అధికారులు మారడం లేదు. ఒక పార్టీ నాయకుడి సినిమా అయినంత మాత్రాన ఆంక్షలు పెట్టాల్సిన అవసరం లేదు. ధరలు పెంచినా నచ్చితే సినిమా చూస్తారు. లేకపోతే పట్టించుకోరు. ఇదే పవన్ ఎంతో ఓపికగా తీసిన అజ్ఞాత వాసి వంటి సినిమాలు ఏమయ్యాయో అందరికీ తెలిసిందే. అందువల్ల ప్రజల విజ్ఞతకు, విచక్షణకు వదిలేయాల్సిన చోట్ల అధికారులు అనవసర జోక్యం ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుంది.న్యాయస్థానాలు అన్నిటా తాము న్యాయంటున్నాయి. మంచిదే. ఒక సామాన్యుని సమస్యలు, ప్రజలకు సంబంధించిన అత్యవసర విషయాల్లో కోర్టులు , న్యాయాధిపతులు ఎక్కువ సమయాన్ని వెచ్చించడం మంచిది. ప్రజాజీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేయని అంశాలపై పట్టించుకోకుండా ఉండటమే ఉత్తమం. ఒక సినిమా వల్ల కొంపలేమీ అంటుకుపోవు. దానిపై న్యాయస్థానాలు తమ విలువైన సమయాన్ని వృథా చేయడం అర్థం కాని విషయం. అందులోనూ భిన్నమైన తీర్పులు. ఒక న్యాయమూర్తి ధరలు పెంచుకోమని తీర్పు చెబుతారు. మళ్లీ అదే న్యాయస్థానంలోని కొందరు న్యాయమూర్తులు ధరలపై కళ్లెం వేస్తారు. దీనిని పరిశీలనగా చూసేవారికి హాస్యాస్పదంగా కనిపిస్తుంది. సామాజిక అశాంతి, సంఘ భద్రత, మతపరమైన విద్వేషాలు పెల్లుబికే ప్రమాదం ఉంటే తప్ప సినిమాల విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పేయాలి. లేకపోతే ప్రతి విషయాన్ని చలనచిత్ర రంగం వారు, ప్రభుత్వం వారు కోర్టుల ముందు పెట్టి సమయాన్ని తినేస్తుంటారు. ఇవేమీ ప్రాథమిక హక్కుల వంటి రాజ్యాంగ విధులతో ముడిపడిన అంశాలు కానేకావు. తమకు ఖాళీ లేదని కోర్టులు చెప్పేయగలగాలి. లేకపోతే వీటిపై తీర్పుల్లో జాప్యం చేస్తే వాటంతటవే సద్దుమణిగిపోతాయి. న్యాయస్థానాలకు చెడ్డపేరు రాకుండా ఉంటుంది. తమ విలువైన సమయాన్ని ప్రజాప్రయోజనాలకు సంబంధించిన కేసులకు కేటాయించుకోవచ్చు.

ప్రజాపాలన

సంపాదకీయం

గురువారం 15, ఏప్రిల్ 2021

# నాయకుని నీడలో సైద్ధాంతిక పార్టీ!

పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ఘట్టం ముగియకముందే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తున్నారు. బెంగాల్‌లో తాము 200 సీట్లు గెలుచుకుంటామని అమిత్ షా ఇప్పటికే ప్రకటించగా, ఇప్పటివరకూ జరిగిన నాలుగు దశల ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్‌కు మెజారిటీ సీట్లు రావని, మే 2న ఫలితాలు వచ్చే సరికి ఆ పార్టీ పరాజయం చెందక తప్పదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాజాగా ఎన్నికల సభలో ప్రకటించారు. నందిగ్రామ్‌లో కూడా మమతా బెనర్జీ ఓడిపోతుందని ఆయన ప్రకటించారు. ఎన్నికల కమిషన్ అయితే ఎగ్జిట్ పోల్స్‌ను నిషేధించింది కాని ఒక ప్రధానమంత్రి, హోంమంత్రి స్థాయిలో ఉన్న నేతలు ఎన్నికల ఫలితాల గురించి ముందుగానే ప్రకటించడాన్ని నిషేధించలేదు. ప్రతి దశ పోలింగ్ తర్వాత ఉన్నత పదవుల్లో ఉన్న వారు ఎన్నికల ఫలితాలు ప్రకటించడం ఒక మైండ్ గేమ్. అలా ప్రకటిస్తే బిజెపి గెలుస్తుందన్న అభిప్రాయం జనంలోకి పాకిపోతుందని, అది తర్వాతి దశలో పోలింగ్ సరళిపై ప్రభావం చూపుతుందని పార్టీ నేతల భావన. ప్రధానమంత్రి, హోంమంత్రి ఇద్దరూ ఎన్నికల ఫలితాల గురించి తామే ప్రకటిస్తున్నారంటే అందుకు రెండు ప్రధాన కారణాలుంటాయి. ఒకటి– ప్రజలు, కార్యకర్తల మనోభావాలను తమకు అనుకూలంగా మళ్లించుకోవడం కోసంబీ రెండు– అలా ప్రకటించడం ద్వారా ఎన్నికల్లో రెండు పార్టీల మధ్య హోరా హోరీ పోరు జరుగుతున్నదన్న విషయం స్పష్టం చేయడం. తృణమూల్ కాంగ్రెస్‌ను పశ్చిమబెంగాల్‌లో ఓడించడం అంత సులభం కాదని తెలిసినందువల్లే బిజెపి అగ్రనేతలు తమ సర్వశక్తులూ ఒడ్డి పోరాడుతున్నారు. ఒక ప్రాంతీయ పార్టీని ఓడించడానికి ఒక జాతీయ పార్టీ అర్థ బలం, అంగబలంతో పూర్తిగా రంగంలో దిగిన వైనం స్పష్టంగా కనపడుతోంది. ప్రధానమంత్రి, హోంమంత్రి, రక్షణమంత్రి, ఇతర కేంద్రమంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇప్పుడు బెంగాల్ లోనే ఉన్నారు. దేశ వ్యాప్తంగా కరోనా విలయతాండవం చేస్తున్నా, గత 34 రోజులుగా కరోనా రోజురోజుకూ పెరిగిపోతూ, రోజుకు లక్షా 68వేల కేసుల పైగా దాటిపోతున్నా, అనేక రాష్ట్రాలనుంచి తమకు వాక్సిన్ కావాలని డిమాండ్లు తీవ్రతరమవుతున్నా మోదీ ఆయన మంత్రివర్గం, బిజెపి నేతలంతా బెంగాల్‌లోనే మోహరించారు. మోదీ మనస్సు ఇప్పుడు బెంగాల్ పైనే తప్ప మరెక్కడా లేదని ఆయన మాట్లాడున్న తీరు, చేపడుతున్న చర్యలు స్పష్టం చేస్తున్నాయి. గత కొంతకాలంగా ఏ కార్యక్రమం చేపట్టినా ఆయన బెంగాల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే చేపడుతున్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 125వ జయంత్యుత్సవాలు, బంగ్లాదేశ్‌కు వెళ్లి మతువా జాతి దేవాలయాన్నిసందర్శించడం తో పాటు ప్రధానమంత్రి ఎక్కడ ఏ ప్రసంగం చేసినా బెంగాల్‌తో ముడిపెట్టకుండా ఉండడం లేదు. బెంగాల్‌లో మమతా బెనర్జీని ఢీకొనడానికి మోదీ స్వయంగా రంగంలో దిగడం, 20కి పైగా ఎన్నికల ర్యాలీల్లో పాల్గొనడం, ప్రతి సభలోనూ ఆయన ప్రసంగం పూర్తిగా మమతా బెనర్జీపై దాడికే కేటాయించడం ఎన్నికల ఘట్టాన్ని రసవత్తరంగా మార్చింది. దీదీ, ఓ దీదీ అని నరేంద్ర మోదీ సభల్లో చేస్తున్న పిలుపులు జనంలో ప్రతిధ్వనిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన కైలాశ్ విజయవర్గేయ లాంటి నేతలు గత ఆరేళ్లుగా బెంగాల్‌లో క్రిందిస్థాయి నుంచి పార్టీని నిర్మించే పనిని చేపడుతున్నారు. మమతా బెనర్జీకి కుడిభుజంలా ఉన్న అనేక మంది నేతలను బిజెపిలోకి ఆకర్షించే పనులు ఎప్పటి నుంచో జరిగాయి. వామపక్ష కార్యకర్తలను సైతం బిజెపి విస్మరించలేదు, గ్రామాల్లో వేలాది వామపక్ష కార్యకర్తలు బిజెపిలో చేరారు. అవకాశం వచ్చినప్పుడల్లా హోంమంత్రి అమిత్ షా పశ్చిమ బెంగాల్ వెళ్లి కార్యకర్తల సమావేశాలు, యాత్రలు నిర్వహించారు. ఇతర రాష్ట్రాలనుంచి యోగి ఆదిత్యనాథ్‌తో పాటు అనేకమంది నేతలను దించారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరో ఎత్తు. బెంగాల్ దృశ్యం మారడానికి పూర్తిగా మోదీయే కారణమని వేరే చెప్పనక్కర్లేదు. బెంగాల్‌లో ప్రధాన ఆకర్షణగా తాను మారడానికి మోదీ అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఒక నాటకంలో కానీ, సినిమాలో కాని, పాత్రకు తగట్టు ఆహార్యం, వేష భాషలు, సంభాషణలు మార్చడానికి కథానాయకుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటారో మోదీ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. మమతా బెనర్జీ తరఫున ఎన్నికల వ్యూహకర్తగా రంగంలోకి దిగిన ప్రశాంత్ కిషోర్ కూడా నరేంద్రమోదీ విజృంభణను చూసి ఒకరకంగా ఆత్మరక్షణలో పడ్డారని ఆయన చేసిన వ్యాఖ్యలు నిరూపిస్తున్నాయి. బిజెపి శక్తిని, ముఖ్యంగా నరేంద్రమోదీ ఆకర్షణను తక్కువ అంచనా వేయలేమని ఆయన కొందరు జర్నలిస్టులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు నిరూపిస్తున్నాయి. దళితులైన మతువాలను మోదీ తన వైపుకు తిప్పుకున్నారని ఆయన చెప్పడంతో మోదీ బంగ్లాదేశ్ పర్యటన దాదాపు విజయవంతమైనదనే భావించవచ్చు. దేశ రాజకీయాల్లో సిద్ధాంతపరమైన రాజకీయాలపై వ్యక్తి కేంద్రీకృత రాజకీయాల ఆధిపత్యం ఏర్పడడం అనేది ఒక దురదృష్టకర పరిణామం. గతంలో నెహ్రూ, ఇందిర, రాజీవ్ లాంటి వారు వ్యక్తిగత ఆకర్షణ పేరుతో కాంగ్రెస్ అన్న సంస్థను కుటుంబ సంస్థగా మార్చారని విమర్శలు ఎదుర్కొన్నారు. చాలా మంది ప్రాంతీయపార్టీల అధినేతలు కూడా పార్టీలను తమ స్వంత ఇష్టాయిష్టాలకు అనుగుణంగా మార్చారని విమర్శలకు గురయ్యారు. కాని బిజెపి లాంటి సైద్ధాంతిక పునాది ఉన్న పార్టీ ఇవాళ కేవలం ఒక వ్యక్తి ఆధారిత పార్టీగా మారడం అనేది ఎందుకు జరిగింది అన్నది చర్చించవలసిన అవసరం ఉన్నది. బిజెపి ఒక జాతీయ శక్తిగా ఆవిర్భవించడానికి దాదాపు అయిదు దశాబ్దాలుగా కృషి చేస్తూ వచ్చింది. లాల్ కృష్ణ ఆడ్వాణీ నేతృత్వంలో ఒక సైద్ధాంతిక భావజాలం గల పార్టీగా బిజెపిని ప్రజలముందుకు తీసుకురావడానికి విశేషమైన కృషి జరిగింది. దేశ విభజన జరగకముందే 14 సంవత్సరాల వయస్సులో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో చేరిన ఆడ్వాణీ మాతృభూమికి నిస్వార్థ సేవ చేసేందుకు ఎన్నో త్యాగాలు చేశారని అటల్ బిహారీ వాజపేయి ఆడ్వాణీ ఆత్మకథకు రాసిన ముందుమాటలో పేర్కొన్నారు. అన్ని పార్టీల కంటే బిజెపి విశిష్టమైనదని, దీనదయాళ్ ఉద్దేశించిన సమగ్ర మానవతా వాదం తమ సిద్ధాంతమని అప్పుడు ప్రచారం జరిగేది. కాని అడ్వాణీ నేతృత్వంలో రెండు సార్లు భారతీయ జనతాపార్టీ పోరాడినప్పటికీ ఆ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రాలేకపోయింది. నిజానికి ఆడ్వాణీ నేతృత్వంలో రామజన్మభూమి ఉద్యమం ఊపందుకుని 1992లో బాబ్రీమసీదు కట్టడం కూల్చివేత తర్వాత నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీలను రద్దు చేస్తే మూడు రాష్ట్రాల్లో బిజెపి తిరిగి అధికారంలోకి రాలేకపోయింది. అయినప్పటికీ ఆడ్వాణీ బిజెపిని ఒక్క సిద్ధాంత ఆధారిత పార్టీగా మార్చేందుకు ఎంతో ప్రయత్నించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రాజ్యాంగాన్ని లిఖించడంలోనే యువకుడుగా పాత్ర పోషించిన ఆడ్వాణీ జనసంఘ్, బిజెపిలకు ఒక సైద్ధాంతిక పునాదిని ఏర్పర్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సారథ్యంలో ఒక సైద్ధాంతిక పునాది వల్లనే బిజెపి వివిధ రాష్ట్రాల్లో బలోపేతం అయింది, భైరాన్ సింగ్ షెఖావత్, కుశభావు థాక్రే లాంటి వారి వల్ల రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో బిజెపి బలోపేతం కావడానికి అవసరమైన నిర్మాణం ఏర్పడింది. ఒక సైద్ధాంతిక నిర్మాణంతో ఏర్పడిన పార్టీ ఒక వ్యక్తి ఆకర్షణ వల్ల, ఆయన హావభావాల వల్ల, రాజకీయ విన్యాసాల వల్ల, రకరకాల పన్నాగాల వల్ల బలోపేతం కావడం అనేది ప్రజాస్వామ్యంలో ఒక విపరీత పరిణామం అని చెప్పక తప్పదు. కాంగ్రెస్ పార్టీ అలాంటి వ్యక్తిగత ఆకర్షణలపై ఆధారపడినందువల్లే అనతికాలంలో అది వందిమాగధుల పార్టీగా మారి, ముఠాలు, వర్గాలుగా చీలిపోయి నేడు ఈ దుస్థితిలో పడిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుజరాత్‌లో మోదీ అధికారంలోకి రాకముందే కాంగ్రెస్ వ్యతిరేక వాతావరణం ఏర్పడడానికి సామాజిక, చారిత్రక మూలాలున్నాయి. బిజెపి దాన్ని అనుకూలంగా మళ్లించుకుంది. నరేంద్రమోదీ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ అధికారాన్ని స్థిరపరిచేందుకు, మూడు సార్లు ముఖ్యమంత్రి పదవి చేపట్టేందుకు ఎటువంటి వ్యూహాలను అవలంభించారో చరిత్ర పుటల్లో నమోదైంది. ఇక ఆడ్వాణీ సారథ్యంలో బిజెపి అధికారంలోకి రావడంలో విఫలమైన తర్వాత, యుపిఏ పది సంవత్సరాల పాలనలో ప్రజావ్యతిరేకతను చవిచూసిన తర్వాత దేశంలో ప్రత్యామ్నాయం కోసం ప్రజలు ఎదురు చూస్తున్న తరుణంలో బిజెపికి సారథ్యం వహించే అవకాశాన్ని సంఘ్ ఆయనకు ఇచ్చింది. కాని ఈ ఆరేళ్లలో నరేంద్రమోదీ బిజెపిని, ఆర్ఎస్ఎస్‌ను మించిన నాయకుడు అయ్యారా? ఇవాళ సంస్థ కన్నా వ్యక్తి ప్రాధాన్యత పెరిగిందా, తమ భావజాలంపై మోదీ వ్యక్తిత్వం నీడలు పరుచుకున్నాయా? ఈ విషయాలపై ఆత్మ పరిశీలన చేసుకోవాల్సింది ఆరెస్సెస్, బిజెపి నేతలే. ఒకప్పుడు ఇందిరాయే ఇండియా, ఇండియాయే ఇందిరా అన్నందుకు బారువా అనే ఒక వంధిమాగధుడు తీవ్ర విమర్శలకు లోనయ్యారు. ఇవాళ మోదీయే ఇండియా, ఇండియాయే మోదీ అన్న పరిస్థితి ఏర్పడింది. మోదీ ఆర్థిక విధానాలు, వివిధ రాష్ట్రాల్లో అధికారం కోసం బిజెపి చేస్తున్న కుట్రపూరిత యత్నాలు, ప్రత్యర్థులను అణిచివేసేందుకు సంస్థలను ఉపయోగించుకుంటున్న తీరు, సీనియర్ నేతలనుంచి కేంద్ర మంత్రులవరకు మోదీ భజన చేయకుండా ఉండలేని స్థితి, నిరసన ప్రదర్శనలపై అవలంభిస్తున్న దౌర్జన్యపూరిత చర్యల వల్ల ఆరెస్సెస్, బిజెపి విశ్వసనీయత పెరిగిందా, తగ్గిందా అని ఆ సంస్థల నాయకులే చర్చించుకోవాలి. ఎటువంటి విన్యాసాలకైనా ప్రజలు ఏదో ఒకరోజు స్వస్తి చెబుతారన్న సత్యం చరిత్రపుటలు వెతికితే వెల్లడవుతుంది.

# ప్రపంచ పీడితుల విముక్తి అంబేడ్కరిజం



బాబాసాహెబ్ డా. బి. ఆర్. అంబేడ్కర్ సామాజిక, ఆర్థిక , రాజకీయ అసమానతలు లేని భారతదేశం కోసం, భారతదేశంలో ప్రతి పౌరుడు/పౌరుల ఓటు హక్కుకోసం , భారతీయ మహిళల హక్కుల కోసం , ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత భారత రాజ్యాంగ ద్వారా భారతదేశ పౌరులకు సమాన హక్కులు , స్వేచ్ఛ , సమానత్వం, సౌభ్రాతత్వం కల్పించారు ,ఆయన చేసిన కృషి ప్రపంచంలో ఏ నాయకుడు చేయలేదు అని భారతదేశ ప్రజలమైన మనం గుర్తించుకొని గర్వించుకోవాలి. తరతరాల దళితుల బానిస సంకెళ్లు తెంపిన పోరాట యోధుడుగా.కుల నిర్మూలన కోసం జీవితాంతం పెనుగులాట పాడిన వ్యక్తి.మత మూఢ?త్వంపై నిరంతరం పోరు నలిపిన యోధుడు.ప్రపంచ దేశాలు భారత రాజ్యాంగం రూపశిల్పి, డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలో వున్న హక్కులు తీసుకుంటుంటే మన దేశంలో అవి ఎలా తీసివేయాలని చుస్తున్నాయి అధికారంలోకి వచ్చిన పాలక వర్గాలు. ఈరోజు ఐక్యరాజ్య సమితి నుండి ప్రపంచ దేశాలు అంబేడ్కర్ ను ఒక ఐకాన్ గా గుర్తిస్తుంటే మన దేశంలో అంబేడ్కర్ ను ఒక కులంగా , ఒక మతంగా చూస్తూ విగ్రహాలు కూల్చివేతకు గురిచేస్తున్నం. అంబేడ్కర్ పుట్టినరోజును కొలంబియా యూనివర్సిటీ నాలెడ్జ్ డేగా ప్రకటిస్తే మనం ఇక్కడ ఆయనను దళితుడాగా ముద్రవేసి తక్కువ చేసే విధానాన్ని గుర్తించాలి. ఇతర దేశాలు బాబాసాహెబ్ ను సమానత్వం కోసం పోరాడిన వారిగా చూస్తుంటే ఇక్కడ విడదీసి చూస్తున్నం.ప్రపంచంలో అతి పెద్ద లైబ్రరీ లండన్ లో ఉంటే ఆ పుస్తకాలు మొత్తంచదివిన డా. బి. ఆర్. అంబెడ్కర్ అని ప్రపంచం చెప్తూంది. భారతదేశంలో రోజుకు 18 గంటల పనిచేసే విధానాన్ని 8 గంటలకు కుదించి కార్మికులు హక్కులు కోసం పోరాడిన కార్మిక నాయకుడు.రిజర్వ బ్యాంకు ఎర్పాడటంలో కీలకపాత్ర పోషించిన వ్యక్తి డా.బి.ఆర్.అంబేడ్కర్ కానీ ఒక్క నోటుపై అంబేడ్కర్ బొమ్మ కనపడదు. అరబ్బ దేశాలలో ఇప్పటికీ అక్కడ స్రీలకు ఓటు హక్కు లేదా చట్ట సభలలో ఆవకాశం లేదు కానీ మనకు ఆ అవకాశం ఎప్పుడో కల్పించారు అంబేడ్కర్. అనేక రూపాల్లో భారతదేశం కోసం భారతదేశ ప్రజలకోసం నిరంతరం పోరాటం చేసారు.ప్రపంచ మహా మేధావి డా. బి. ఆర్. అంబేడ్కర్. ప్రపంచంలో అత్యధిక డిగ్రీలు చదివిన వ్యక్తులో అంబేడ్కర్ ఒకరు. భారతదేశంలో మహిళల హక్కులు కోసం కేంద్ర న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి మహిళలు పక్షపాతి అంబేడ్కర్. ఈరోజు మహిళలు ఆస్తిలో వాట హక్కులు అంబేడ్కర్ పుణ్యమే.ప్రసూతి సెలవులు కూడా అంబేడ్కర్ వలన కలిగినవే అయినాఅంబేడ్కర్ పట్లా ఎందుకో దళిత స్త్రీలు అక్కున చేర్చుకున్నట్లు ఇతర కులాల స్త్రీలు అంబేడ్కర్ కృషిని గుర్తించటం లేదు. బహుజన ఉద్యమాలకు , బహుజన రాజ్యాధికారం ఆలోచనకు ఆద్యుడు అంబేడ్కర్, ఈరోజు అంబేడ్కర్ పేరు లేకుండా ఏ ఉద్యమం మైన ఏ చ ట్ట ఎ ా న రూపొందటంలేదు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే రాజ్యాంగాన్ని రూపొందించాడు అందుకే అంబేడ్కర్ అందరివాడు,కొందరు వాడు కాదని, ఈ భారతదేశ సమస్త ప్రజానీకం సొంతం అని చెప్పటానికి

ఏప్రిల్ 14 ప్రపంచం మొత్తం అంబేడ్కర్ జయంతులు వాడ వాడల నుంచి ప్రపంచం మొత్తం సంబరాలు జరుకుంటుంది .

**తంగిరాల. సోని**
**96 766 09 234**

# చరిత్రపై చెరగని సంతకం

అతను విద్యార్థి అయితే, నేల మీద కూర్చొని చదువుకోవాల్సి వచ్చింది. బడిలో బెంచ్ మీద కూర్చోనివ్వలేదు. నల్లబల్లనీ తాకనివ్వలేదు. ట్యూషన్లు చెప్పుకుని బతికాడు. స్టాక్స్, షేర్ల వ్యాపారులు లాభసాటి సలహాలు తీసుకున్నవారే, అతని సాంఘిక నేపథ్యం తెలియగానే సలహాలకు రావడం మానేశారు! న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశాడు. అతను మాష్టారై అధ్యాపక ఉపన్యాసాలు చేస్తే, ఆసక్తిగా విన్న విద్యార్థులూ, సహోద్యోగులే అంటుముట్టు పాటించి అవహేళనలు చేశారు. అతను మహద్ చెరువులో తాగునీటికోసం ఉద్యమిస్తే, వెయ్యి బిందెల నీళ్ళతో చెరువును శుద్ధి చేసుకున్నారు! అతను ఆలయ ప్రవేశ అంశం అధికారులతో చర్చించబోతే, ఆలయాన్ని శుద్ధి చేసుకున్నారు! అతను అధికారియై విధులు నిర్వహించబోతే, బంట్రోతులు ఫైళ్ళు చేతికి అందించకుండా బల్లమీదే విసిరేసి అవమానించారు! అతను సత్రంలో బసచేస్తే సత్రం యజమాని బయటకు గెంటేశాడు. నిద్రాహారాలూ లేక చెట్టు కింద కూర్చొని రాత్రంతా ఏడ్చాడు! అతను భవిష్యత్ భారత రాజ్యాంగ నిర్మాత! అతను దేశం మెచ్చిన భవిష్యత్ భారతరత్న! వర్ణ, కుల వివక్షల నిర్మూలనా విప్లవ నేత! అణగారిన వర్గాల రాజకీయ విముక్తికి మార్గదాత! సామాజిక సమానత్వ ఉద్యమ నేత! ప్రజలు ప్రేమగా పిలుచుకునే బాబాసాహెబ్! ఆయనే డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్!భారతదేశ రాజకీయాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ పాత్ర మహోన్నతమైనది. ఆయన ప్రపంచ స్థాయి ఆర్థిక శాస్త్రవేత్త, విద్యావేత్త, సామాజిక శాస్త్రవేత్త, గొప్ప పరిశోధకుడు. అంతర్జాతీయ న్యాయకోవిదుడు. బహుభాషా నిపుణుడు. బహు గ్రంథకర్త. భారతీయ సమాజంలో లోతుగా వేళ్లూనుకొని ఉన్న సామాజిక వివక్షల నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన యోధుడు. సామాన్యునిగా ప్రారంభమైన అంబేడ్కర్ జీవితం, అణగారిన సామాజిక వర్గాల ప్రపంచ నాయకుని స్థాయికి చేరుకుంది. 1920లోనే డాక్టర్ అంబేడ్కర్ బొంబాయి శాసనమండలి సభ్యునిగా నామినేట్ అయి, మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు. బహుజనుల హక్కుల కోసం అంబేడ్కర్ పలు సంస్థలను స్థాపించారు. 1924 జూలై 20న బహిష్కృత హితకారిణి సభ, 1927 సెప్టెంబర్ 4న సమతా సమాజ సంగ, 1936 ఆగస్టు 6న ఇండిపెండెంట్ లేబర్‌పార్టీ, 1942 జూలై 19న షెడ్యూల్డు క్యాస్ట్ ఫెడరేషన్‌లను స్థాపించారు. 1937 ఫిబ్రవరి 17న జరిగిన బొంబాయి రాష్ట్రం ఎన్నికల్లో ఇండిపెండెంట్ లేబర్ పార్టీ అనుకున్న వాటికన్నా ఎక్కువ స్థానాలను గెలుచుకుంది. పదిహేను స్థానాల బలంతో రాష్ట్ర అసెంబ్లీలో అంబేడ్కర్ ప్రతిపక్షనేతగా ఎన్నికయ్యారు. వెట్టి చాకిరీ రద్దు, హరిజన పదం రద్దు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, దళితులు, అణగారిన సామాజికవర్గాల వారి హక్కుల కోసం అసెంబ్లీ లోపలా, వెలుపలా డాక్టర్ అంబేడ్కర్ నిరంతరం ఉద్యమిస్తూ వచ్చారు. 1935లో రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపనలో డాక్టర్ అంబేడ్కర్ కీలక పాత్ర నిర్వహించారు. భారతీయ ఆర్థిక వ్యవస్థ, కరెన్సీనోట్ల సమస్యలపై అధ్యయనం చెయ్యడానికి బ్రిటీష్ ప్రభుత్వం నియమించిన రాయల్ కమిషన్‌గా ప్రసిద్ధి చెందిన హిల్టన్ యంగ్ కమిషన్‌కు సమర్పించిన విజ్ఞప్తుల్లోని మార్గదర్శకాలే తదుపరి కాలంలో రిజర్వు బ్యాంకు స్థాపన, దాని దార్శనిక దృక్పథంగా మారింది. దీనికంతటికీ ఆధారం 1922లో డాక్టర్ అంబేడ్కర్ యూనివర్శిటీ ఆఫ్ లండన్‌లో డాక్టరేట్ పట్టా కోసం రాసిన పరిశోధనా గ్రంథం 'రూపాయి సమస్య %--% పుట్టుక, పరిష్కారం' అని చెప్పుకోవాలి. నిజానికి ఈ సేవకుగాను భారతీయ కరెన్సీ నోట్లపై డాక్టర్ అంబేడ్కర్ బొమ్మ ముద్రించి ఉండినట్లయితే, భారత ప్రభుత్వ వ్యవస్థ మహనీయుడు డాక్టర్ అంబేడ్కర్‌కు కొంతైనా గౌరవాన్ని అందించి తనని తాను గౌరవించుకొని ఉండేది. డాక్టర్ అంబేడ్కర్ వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా రెండు పదవుల్లో పని చేశారు. ఒకటి%--%వైస్రాయి లేబర్ కౌన్సిల్ సభ్యునిగా, రెండు, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ మెంబర్‌గా 1942 నుంచి 1946 దాకా పని చేశారు. ఈ కాలంలో భారతదేశంలో అనేక కార్మిక సంస్కరణలకు డాక్టర్ అంబేడ్కర్ పూనుకున్నారు. ఢిల్లీలో 1942 నవంబర్‌లో జరిగిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ఏడవ సెషన్‌లో భారతదేశంలో 12 గంటల పనిదినాన్ని ఎనిమిది గంటల పనిదినంగా డాక్టర్ అంబేడ్కర్ మార్చారు. అంతేగాదు, కార్మికుల సంక్షేమం కోసం కరువు భత్యం, సెలవు లాభం, ఉద్యోగ భీమా, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనాలు, ఇఎస్‌ఐ నిర్ణీత కాల వ్యవధిలో వేతనాల సవరణ మొదలగు జీవన సదుపాయాలు, భద్రతలు, ప్రమాణాలను భారతదేశ కార్మికవర్గం, ఉద్యోగవర్గాల కోసం డాక్టర్ అంబేడ్కర్ ప్రవేశపెట్టారు. ఇంకా దేశమంతటా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలను స్థాపించడానికి, కార్మిక సంఘాలను పటిష్ఠం చెయ్యడానికి, డాక్టర్ అంబేడ్కర్ చేసిన కృషి అపూర్వమైనది. ఈ మేళ్ళకుగాను, భారతదేశ కార్మిక, ఉద్యోగ వర్గాలు అంబేడ్కర్ నుంచి నిత్యస్ఫూర్తిని పొందవలసిన అవసరం ఉంది. సవర్ణ కమ్యూనిస్టు పార్టీలుగానీ, వాటి అనుబంధ ట్రేడ్ యూనియన్లుగానీ కార్మికుల హక్కుల కోసం ఎనలేని సేవలు చేసిన డాక్టర్ అంబేడ్కర్‌ని విస్మరించడం గర్హనీయం. స్వతంత్ర భారతదేశంలో బహుళార్థ సాధక నదీలోయ ప్రాజెక్టులకు అంబేడ్కర్ మార్గదర్శకత్వం వహించారు. దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు, సోన్ నదీలోయ ప్రాజెక్టు, భాక్రానంగల్ డ్యాం ప్రాజెక్టు, హీరాకుడ్ డ్యాం ప్రాజెక్టు మొదలైనవి. అలాగే కేంద్ర, రాష్ట్రాల్లో సాగునీటి పారుదల అభివృద్ధి కోసం కేంద్ర జలసంఘాన్ని స్థాపించారు. శక్తిమంతమైన జల, థర్మల్ విద్యుత్ కేంద్రాలను స్థాపించి, భారత విద్యుత్ రంగంలో సెంట్రల్ టెక్నికల్ పవర్‌బోర్డ్‌ను, కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థను స్థాపించడం వెనక డాక్టర్ అంబేడ్కర్ కృషి ఎంతో అమూల్యమైనది. సుశిక్షిత విద్యుత్ ఇంజనీర్ల అవసరాన్ని పవర్‌గ్రిడ్ వ్యవస్థల అవసరాన్ని డాక్టర్ అంబేడ్కర్ ఆనాడే ఉద్ఘాటించారు.

ఇండియాలోని రైతు సంఘాలుగానీ, పారిశ్రామిక యాజమాన్యాలు గానీ అంబేడ్కర్‌ని తలుచుకున్నట్టు ఎక్కడా కనిపించదు, వినిపించదు మనకు. ఇదొక పెద్ద విషాదం. భారతీయ మహిళా లోకానికి కొన్ని ముఖ్యమైన హక్కులను కల్పించిన హిందూకోడ్ బిల్లు పార్లమెంటులో పాస్‌కావడానికి డాక్టర్ అంబేడ్కర్ ఏళ్ళ తరబడి సవర్ణ పితృస్వామ్య రాజకీయాలతో పోరాడారు. ఈ బిల్లు ముఖ్యంగా రెండు ప్రయోజనాలకు ఉద్దేశించింది. ఒకటి హిందూ మహిళలు కోల్పోయిన హక్కులను పునరుద్ధరించి వారికి సాంఘిక హోదా కల్పించడం. రెండు: సాంఘిక వ్యత్యాసాలను, కుల అసమానతలను అధికారికంగా రద్దు చెయ్యడం.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నివాళులర్పించిన జిల్లా ఎస్పీ



కృష్ణాజిల్లా ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: భారత రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 130వ జయంతి సందర్భంగా ఈరోజు లక్ష్మీ టాకీస్ సెంటర్ నందు గల అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించిన జిల్లా ఎస్పీ శ్రీ ఎం రవీంద్రనాథ్ బాబు ఐపీఎస్ గారు, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పి శ్రీ వకుల్ జిందల్ ఐపిఎస్ గారు, ఏఆర్ ఏఎస్ పి సత్యనారాయణ గారు, ఇతర పోలీసు అధికారులు.అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయం నందు పోలీసు అధికారులు, సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది సమక్షంలో ఎస్పీ గారు అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు ప్రపంచ దేశాలను భారతదేశం వైపు తలెత్తి చూసేలా భారత రాజ్యాంగాన్ని నిర్మించి చరిత్రపుటల్లో చెరగని ముద్ర వేసుకున్నారు అంబేద్కర్ గారు. ఎన్నో వివక్షత నడుమ తన చదువును పూర్తి చేసి ఇ ఎన్నో డిగ్రీలను చేతబూని నేటి యువతకు ఎందరికో ఆదర్శంగా నిలిచిన ఆదర్శప్రాయుడు అంబేద్కర్ గారు. ఆయన సాధించిన ఘనత గూర్చి చెప్పుకుంటే భారతీయ న్యాయవాది , ఆర్థికవేత్త , రాజకీయవేత్త మరియు సామాజిక సంస్కర్త , అతను దళిత బౌద్ధ ఉద్యమాన్ని ప్రేరేపించాడు. మరియు అంటరానివారి ( దళితుల ) పట్లసామాజిక వివక్షకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. అతను బ్రిటిష్ భారతదేశం యొక్క ఉంది కార్మిక శాఖ మంత్రిగా లో వైస్రాయ్ కార్యనిర్వాహక మండలి సభ్యుడు, రాజ్యాంగ ముసాయిదా కమిటీ , స్వతంత్ర భారతదేశం యొక్క మొదటి లా మరియు జస్టిస్ మంత్రి , మరియు చీఫ్ ఆర్కిటెక్ట్ భావిస్తారు. అంబేద్కర్ గొప్ప విద్యార్థి, కొలంబియా విశ్వవిద్యాలయం మరియు లండన్ విశ్వవిద్యాలయం రెండింటి నుండి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్లు సంపాదించాడు. మరియు న్యాయ, ఆర్థిక శాస్త్రం మరియు రాజకీయ శాస్త్రంలో తన పరిశోధనలకుపండితుడిగా ఖ్యాతిని పొందాడు. తన కెరీర్ ప్రారంభంలో, అతను ఆర్థికవేత్త, ప్రొఫెసర్ మరియు న్యాయవాది. అతని తరువాతి జీవితం అతని రాజకీయ కార్యకలాపాల ద్వారా గుర్తించబడిందిబీ అతను భారతదేశం యొక్క స్వాతంత్ర్యం కోసం ప్రచారం మరియు చర్చలు, పత్రికలను ప్రచురించడం, రాజకీయ హక్కులు మరియు దళితులకు సామాజిక స్వేచ్ఛను సమర్థించడం మరియు భారత రాష్ట్ర స్థాపనకు గణనీయంగా తోడ్పడ్డాడు. 1990 లో భారతదేశపు అత్యున్నత పౌర పురస్కారమైన భారత్ రత్నను మరణానంతరం అంబేద్కర్ కు ప్రదానం చేశారు. అంబేద్కర్ యొక్క వారసత్వం జనాదరణ పొందిన సంస్కృతిలో అనేక జ్ఞాపకాలు మరియు వర్ణనలను కలిగి ఉంది నేటి తరం యువత కృషి పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఎస్పి గారు ఆకాంక్షించారు. ఎంతకాలం జీవించమని కాదు, చరిత్రపుటల్లో ఎంత గా నిలిచిన మనేది ముఖ్యమని, ఆయన స్ఫూర్తి ని ఆదర్శంగా తీసుకుని అత్యున్నత స్థాయికి చేరాలని ఆశిస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి ధర్మేంద్ర గారు, ట్రాఫిక్ డిఎస్పి మాసుం భాషా గారు, డి టి సి డి ఎస్ పి రమేష్ గారు, ఏ ఆర్ డి ఎస్ పి విజయ్ కుమార్ గారు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగేంద్ర కుమార్ గారు, డిసిఆర్బి సిఐ రమేష్ గారు, పట్టణ సిఐలు అంకబాబు గారు, భీమరాజు గారు, ఆర్ఐలు శ్రీనివాస రావు గారు, చంద్రశేఖర్ గారు, వెంకట్రావు గారు, విజయసారథి గారు, ఏవో మూర్తి గారు, ఎస్ ఐ లు, ఆర్ ఎస్ ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.






## భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లలో అవగాహన:రిటర్నింగ్ ఆఫీసర్ కె.వి.యన్.చక్రధర్ బాబు

తిరుపతి, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి:తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో ఓటర్లకు ఓటుహక్కు పై అవగాహన కలిపించటానికి నాన్ పొలిటికల్ స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి. అని నెల్లూరు జిల్లా కలెక్టర్ మరియూ రిటర్నింగ్ ఆఫీసర్ కె. వి. యన్. చక్రధర్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ సంస్థ ప్రెసిడెంట్ ఆర్. కె. దుర్గ పద్మజ ఓటర్ల లో చైతన్యం కలిపించడానికి తయారు చేసిన ప్రచార సామగ్రిని తిరుపతి పార్లమెంటు ఎన్నిక రిటర్నింగ్ అధికారిగా ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొనుట లో అశ్రద్ధ వహిస్తున్నారు దీనివల్ల ఒటింగ్ శాతం తక్కువగా నమోదు అవుతుంది."నా ఓటు–నా బాధ్యత" అనే అంశం ప్రాతిపదికిన ఓటర్లలో చైతన్యం కలిపించాలి. ఈ యొక్క స్వచ్ఛంద సంస్థ "రండి ఓటు వేద్దము..."అని ఓటర్లలో చైతన్యం కలిపించడానికి ముందుకు రావడం గొప్పవిషయం అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా యన్ .జి. ఓ ప్రెసిడెంట్ పద్మజ మాట్లాడుతూ మేము రెండు రోజుల పాటుఓటర్ల లో చైతన్యంకలిపి0చడానికి రిటర్నింగ్ అధికారి ని అనుమతులు కోరడం జరిగింది అని మా వంతుగా ప్రచారం నిర్వహిస్తాము అని తెలిపారు ఈ యొక్క ప్రచార సామగ్రి ని ప్రారంభించిన రిటర్నింగ్ ఆఫీసర్ గారికి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో యన్. జి. ఓ సభ్యులు బాషా, కోటేశ్వరరావు, బంగారయ్య లు పాల్గొన్నారు.

## అందరివాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

**ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 130 వ జయంతి వేడుకలు**



కారంపూడి ఏప్రిల్14..ప్రజాపాలన ప్రతినిధి :డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 130 వ జయంతి వేడుకలు సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం భారీ కేకు. కట్ చేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు మెయిన్ రోడ్ లోగల హరిజన కాలనీ (సచివాలయం 2) వద్ద ఉన్న భారతమాత ముద్దుబిడ్డ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళలు అర్పించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విశ్వజ్ఞాని భారత రత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే మహనీయుల జాబితాలో ముందుండే గొప్ప నేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఆయన ఆలోచనలు ఆదర్శాలు నేటి తరానికే కాదు భావితరాలకు కూడా స్ఫూర్తిదాయకం అని తన జీవిత సర్వస్వాన్ని త్యాగం చేసిన మహనీయుడని నవభారత రాజ్యాంగ నిర్మాత దార్శనికుడు,విశ్వజ్ఞాని,ఈ దేశానికి వేగుచుక్క మార్గదర్శకుడు,హక్కుల ప్రధాత,గొప్పమానవతావాదియినా డాక్టర్.బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

## రాజ్యాంగం మరింత పటిష్టంగా అమలు కావాలి:డివై దాస్



పామర్రు, ప్రజాపాలన ప్రతినిధి:పీడిత వర్గాల అభ్యున్నతితో పాటు భారతదేశ సమగ్ర అభివృద్ధి కోసం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరింత పటిష్టంగా అమలు చేయాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే ప్రముఖ పారిశ్రామికవేత్త డివై దాస్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పామర్రు లో బుధవారం డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ 130వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం దాస్ మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. కేవలం ఎస్సీ ఎస్టీ ల కోసమే కాకుండా బీసీ మైనారిటీలు మహిళల తో పాటు దేశ సమగ్రతను కాపాడే విధంగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించటం జరిగిందన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం ప్రపంచంలో ఎన్నో దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. అంబేద్కర్ ఘనతను గుర్తించిన ఐక్యరాజ్యసమితి ఏప్రిల్ 14న ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా జరుపుకోవడం భారతదేశ గర్వకారణమన్నారు. అంతటి మహోన్నత వ్యక్తి అంబేద్కర్ గారి ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం నేటి యువతపై ఉందన్నారు .రాజకీయాలకతీతంగా అంబేద్కర్ను గౌరవించుకోవడం ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం మన ముందున్న కర్తవ్యం గా దాస్ పేర్కొన్నారు .అందుకోసం ముఖ్యంగా దళిత యువత నడుం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహ కమిటీ నాయకులు దాసరి అశోక్ చిన్నం శ్రీనివాస రావు నందిపు నాగేంద్రం , రామాంజనేయులు నందిరాజు ఎస్సీ ఎస్టీ రాష్ట్ర నాయకులు ప్రవీణ్ వైసిపీ నాయకులు తిరుమల శెట్టి వాసు మొవ్వ శ్రీనివాస్ రెడ్డి చొప్పరపు జగదీష్ కోలా శివ ఆంజనేయులు మేరుగు జనార్ధన్ ,పొట్నూరి పండు మొవ్వా మోహన్ రావు కొణతం వాసు కార్తీక్ సబావతు నాయక్ వరిగంజి నాగేంద్రం బురదగుంట వెంకటేశ్వర రావు సాయి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ 130వ జయంతి మహోత్సవం



బాపులపాడు మండలం వీరవల్లి వైకాపా నాయకులు జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

## గుంటూరు జిల్లా రూరల్ పోలీస్ కార్యాలయంలో అంబేత్కర్ జయంతి



గుంటూరు, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి:భారత రాజ్యాంగ నిర్మాత గౌరవనీయులు డా''.బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా గుంటూరు రూరల్ జిల్లా పోలీస్ కార్యాలయములో శ్రీ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి,ఘనముగా నివాళులు అర్పించిన లిరూరల్ ఎస్పీ శ్రీ విశాల్ గున్ని ఐపిఎస్ .ఈ సందర్భముగా ఎస్పీ మాట్లాడుతూ లిసమాజంలో వివిధ వర్గాల మధ్య సమానత్వాన్ని పెంపొందించి,తద్వారా సమసమాజమును స్థాపించుటకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి డా" బి.ఆర్.అంబేద్కర్ అని తెలిపారు. సమసమాజ స్థాపనకు ఆయన రూపొందిన విధివిధానాలను యువత అనుసరించాలని,అంబేద్కర్ యొక్క ఆశయాలను మరియు ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ గుంటూరు జిల్లా %ాజుదీ% అధికారి అదనపు ఎస్పీ ఆరిఫ్ అఫీజ్ ఐపిఎస్ , ఏఆర్ అదనపు ఎస్పీ ప్రసాద్ , ఏఆర్ డిఎస్పీ చిన్ని కృష్ణ ,స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలమురళి కృష్ణ , ఆర్ఐలు మరియు సిబ్బంది పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి ఘనముగా నివాళులు అర్పించారు.

## బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ 130వ జయంతి



నరసరావుపేట, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి:బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నవ సమాజ నిర్మాత, ప్రపంచ మేధావి,రాజ్యాంగ రూపకర్త,శ్రీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 130వ జయంతి కార్యక్రమం ఘనంగాలి నిర్వహించినారు. నర్సరావుపేట స్థానిక గడియార స్తంభం సెంటర్లో బి.ఆర్. అంబేద్కర్ 130వ జయంతిలి ఘనంగా నివాళులు అర్పించినారు.. సందర్భము గా బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ.. ."కులం? పునాదులపై ఒక జివి గానీ, ఒక జాతిని గానీ నిర్మించలేము " అని అంబేద్కర్ కు ముందు ఈ భారతదేశంలో కేవలం శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, పట్టభద్రులకు మాత్రమే ఓటు హక్కు ఉండేదని అది గమనించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు భారతదేశం లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి లిఓటు హక్కులి కలిగించాలని రాజ్యాంగం ద్వారా ఓటు హక్కు కల్పించారు, ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయాలని రాజ్యాంగంలో పొందుపరిచారు ,అని రాజ్యాంగం లో ఉన్న చట్టాలు, సక్రమంగా ఉపయోగిస్తే భారత దేశంలో పేదరిక నిర్మూల రాజకీయ నిర్మూలన, ఆర్థిక నిర్మూలనా చేయగలరుఅని కొనియాడారు ,ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కుంచాల వెంకటరావు, పట్టణ అధ్యక్షులు కొల్లిపర బాలాజీ, మండల అధ్యక్షులు నాగారపు గురు ఆంజనేయులు బోయిన సుబ్బారావు గారు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు .

## మాస్కు లేకపోతే జరిమానా:కారంపూడి ఎస్సై గల్లా రవికృష్ణ



కారంపూడి ఏప్రిల్14.. ప్రజాపాలన ప్రతినిధి : కరోనా విజృంభిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ మాస్కు ధరించాలని కారంపూడి ఎస్ ఐ గల్లా రవికృష్ణ కోరారు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో ప్రతి ఒక్కరు మాస్కు ధరించాలని మాస్కు ధరించకపోతే జరిమానా విధించడం జరుగుతుందని ఆయన అన్నారు అవసరమైతే తప్ప అనవసరంగా ఎవరు కూడా బయటికి రావద్దని ఆయన సూచించారు మండలం లో కరోనా కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి అని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ మాస్కు ధరించి విధంగా కృషి చేయాలని ఆయన కార్యదర్శులను కోరారు సచివాలయం పోలీసులు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ కారంపూడిలో ప్రతి ఒక్కరూ మాస్కు ధరించే విధంగా అవగాహన కల్పిస్తామని ఆయన సూచించారు.

# దండలు వేసి మర్చిపో దగ్గ వ్యక్తి కాదు అంబేద్కర్ అంటే!

రాజుపాలెం, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి:ప్రతి ఒక్కరూ గుండెల్లో పెట్టుకో దగ్గ వ్యక్తి అంబేద్కర్ అంటే! అతనో ధైర్యం..దేశానికో గొప్పవరం.. కేవలం దళిత వాడలో పెట్టుకునే విగ్రహం కాదు అంబేద్కర్ అంటే! భరత జాతి యావత్తు పాటించాల్సిన నిగ్రహం అంబేద్కర్ అంటే. దళిత రచయితలు మాత్రమే వాడుకునే కథా వస్తువు కాదు అంబేద్కర్ అంటే! భారత రాజ్యాంగాన్ని రాసిన మేధావి తనం అంబేద్కర్ అంటే! కేవలం దళితుడు మాత్రమే మా వాడు అనుకునే వ్యక్తి కాదు అంబేద్కర్ అంటే! భరత జాతి యావత్తు గర్వ పడాల్సిన అద్భుత శక్తి అంబేద్కర్ అంటే.. ఏ ఒక్క కులానికో పరిమితం కాదు అంబేద్కర్ అంటే! అపరిమితమైన జ్ఞాన సంపన్నుడు అంబేద్కర్ అంటే! మానవ జాతి మొత్తానికి కావాల్సిన వ్యక్తి అంబేద్కర్ అంటే! కేవలం దళితుడు మాత్రమే కాదు అంబేద్కర్ అంటే! దగా పడ్డ వాళ్లకు దేవుడు అంబేద్కర్ అంటే..ఈరోజు అంబేద్కర్ గారి జయంతి సందర్భంగా రాజుపాలెం మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రాజుపాలెం మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంబేద్కర్ గారికి నివాళు లర్పించారు ఈ కార్యక్రమంలో రాజుపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అంచుల నరసింహారావు. మాజీ వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ పూజల వెంకటకోటయ్య గారు. నాగార్జున సాగర్ కుడి కాలువ పిసి మెంబర్ అంకాళ్ళ ప్రభుదాస్. లంకా వీరయ్య. గ్రామ పంచాయతీ రాజుపాలెం మాజీ సర్పంచ్. వెంకటేశ్వర్లు. పులిబండల సాంబశివరావు. కోటేశ్వరరావు తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు రాజా గారు తమటం వీరయ్య శనగపోలు నరసింహారావు. బ్రహ్మనపలి సధా నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 130వ జయంతి వేడుకలు



పెనుగంచిప్రోలు 14 ఏప్రిల్ (ప్రజాపాలన)రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 130వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి,ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు, ఈ కార్యక్రమంలో వేల్పుల రవికుమార్, వేల్పుల పద్మ కుమారి, రాష్ట్ర పూసల సంఘం డైరెక్టర్ చేని కుమారి, ఇంజం కేశవరావు,కాకాని హరి, చుంచు బెనర్జీ,గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## 550 మందికి కోవిడ్ వ్యాక్సిన్

బెల్లంకొండ, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: మండలంలోని బుధవారం నాడు మన్నె సుల్తాన్ పాలెం పాపయ పాలెం గ్రామా సచివాలయలలో సుమారుగా 550 మందికి కోవిడ్ వ్యాక్సిన్ వేయడం జరిగిందని చంద్రాజుపాలెం పీహెచ్ సీ. వైద్యులు డాక్టర్ వి ప్రదీప్ తెలిపారు 45 సంవత్సరాలు నుండి 60 సంవత్సరాలు పైబడిన వారికి ఈ వ్యాక్సిన్ వేయడం జరిగిందని తెలిపారు ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి బెల్లంకొండ ఎండిఓ గబ్బ నాయక్ హాజరయ్యారు గబ్బనాయక్ మాట్లాడుతూ 45 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని వేయించుకుంటే ఎలాంటి హాని ఉ ఒడదని తెలిపారు చంద్రా జుపాలెం పి.హెచ్.సి విస్తరణ అధికారి శిఖ సాంసన్ మాట్లాడుతూ మండలంలోని అన్ని సచివాలయాల్లో కోడ్ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు వ్యాక్సిన్ సురక్షితమైనదని ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కార్యదర్శులు సర్పంచులు ఉప సర్పంచులు సచివాలయ సిబ్బంది వార్డ్ సభ్యులు హెల్త్ సూపర్ వైజర్ వైద్య శాఖ సిబ్బంది శ్రీనివాస రావు షేక్ భాష ఆరోగ్య కార్యకర్తలు రాధా జ్యోతి పాప ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన స్పెషల్ సంచిక ఆవిష్కరణ:గురుజాల శ్రీనివాస్ రావు



పొన్నూరు, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 130వ జయంతి సందర్భం గా " ప్రజాపాలనా జాతీయ దినపత్రిక స్పెషల్ సంచిక ఆవిష్కరణ "ఆవిష్కరించిన అంబేద్కర్ టీవీ ఫుల్ టైమ్ డైరెక్టర్ అమ్మిశెట్టి రమాదేవి పొన్నూరు .భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ 130 వ జయంతి సందర్భంగా స్థానిక పొన్నూరు ఆఫీస్ నందు అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా గురిజాల శ్రీనివాస రావు, అమ్మిశెట్టి రమాదేవి మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందడం అంటే అద్దాల మేడలు, మిద్దెలు, రంగులు గోడలు కాదు పౌరుని నైతికభివృదే నిజమైన మన దేశ అభివృద్ధి అని నినదించి, నిరక్షరాస్యతను తరిమికొట్టండి సమాజ స్థాపన కొరకు రాజ్యాంగ రూపకల్పన చేసిన మహానుభావులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆయనను ఈ ప్రపంచం ఎన్నటికీ మర్చిపోదు మర్చిపోలేదని కొనియాడారు... ఈ కార్యక్రమంలో పొన్నూరు అంబేద్కర్ టీవీ ఫుల్ టైం డైరెక్టర్ అమ్మిశెట్టి రమాదేవి మరియు బాపట్ల అంబేద్కర్ టీవీ ఫుల్ టైం డైరెక్టర్ శ్రీనివాసరావు, పొన్నూరు స్నేహ క్లబ్ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గన్నవరంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు

గన్నవరం, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: కృష్ణ జిల్లా గన్నవరం లో మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్– మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాలమహానాడు – కే.వి.పి.యస్ సంయుక్త అధ్వర్యంలో డా.బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు..ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరపల్లి విక్టర్ బాబు,రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షులు జి.వి. రత్నం,ప్రముఖ న్యాయవాది తిరువీధి వెంకయ్య ,మానవతా వాది డా.సీతారాం, అన్నావరపు నాగేశ్వరావు, ఎం.ఈ.ఎఫ్ సీనియర్ నాయకులు పోలిమెట్ల జయరాజు, కొడాలి జోసెఫ్,రాబర్ట్ క్లైవ్, రవి కుమార్, ఎలీషా,అర్.బాలస్వామి, డి. యేసుబాబు,రాజేష్ లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సతీష్,స్థానిక వైసీపీ నాయకులు నిడమర్తి నాగేశ్వరావు,కొల్లి రాజశేఖర్,నల్లమోతు రమేష్,ప్రముఖ హెూమియో వైద్యులు చిప్పాడ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# అంబేడ్కర్ రచనలు చదవాలి.. ఆచరించాలి:బుడితి రాజశేఖర్



విజయవాడ, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి:ప్రపంచ మేధావి, రాజకీయవేత్త, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలు నేటితరం ఆచరించాలని పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి బుడితి రాజశేఖర్ అన్నారు. బుధవారం సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో జరిగిన డా. బీఆర్ అంబేడ్కర్ 130వ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలు మట్టిముద్ద లాంటివారు వాళ్లని ఎలా మలిస్తే అలానే తయారవుతారు కాబట్టి బాల్యదశ నుంచి కుల, మతాల గురించి కాకుండా అందరూ సమానమనే భావనను పెంపొందించాలని, సామాజిక మార్పునకు ప్రయత్నించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. అంబేడ్కర్, గాంధీజీ, మదర్ థెరిసా వంటి మహనీయుల గురించిన పుస్తకాలు పిల్లల చేత ఎక్కువగా చదివించాలని, అప్పుడే పిల్లల్లో ఆదర్శభావాలు పెరగడంతో పాటు స్వేచ్ఛా సమానత్వం, శాస్త్రీయత గురించి ఆలోచించే భావజాలాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలని అన్నారు. అందుకు విద్యాశాఖకు ఒక మంచి అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ మన బాధ్యతగా పని చేసి అంబేద్కర్ ఆశయాలను సాధించాలని కోరారు. అనంతరం పాఠశాల విద్య సలహాదారు ఆకునూరి మురళి ప్రసంగిస్తూ కుల వివక్ష వల్ల ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా చదువు ఓ తపస్సుగా భావించి చదువుకు కులం అడ్డు కాదని నిరూపించిన వ్యక్తి అంబేద్కర్ అని, కొన్ని కోట్ల మంది జనాలకు ఆయన స్ఫూర్తిదాయకమని గుర్తు చేశారు.సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు కె.వెట్రి సెల్వి మాట్లాడుతూ అంబేద్కర్ అనగానే కులానికి పరిమితం చేయకూడదని గొప్ప వ్యక్తిగా, మేధావిగా గుర్తించాలని అన్నారు. ఆయన ఆశయాలు, లక్ష్యాలు పాటించాలని సూచిస్తూ, ఇప్పటికీ కులాంతర వివాహాల దగ్గర ఇబ్బందులు పెట్టడం, వీధుల్లో కూడా ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేయడం వంటివి మార్పు చెందాలని, అందరూ సమానత్వం తో మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముందు పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి, పాఠశాల విద్య సలహాదారు, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా సిబ్బంది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.

# నరసరావుపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి




నరసరావుపేట, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: నరసరావుపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ రోజు డాక్ట%ఎ%ర్ బి. .ఆర్. అంబేద్కర్ 130వ జయంతి వేడుకలు డీ సీసీ అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ ఆధ్వర్యములో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ భీంరావ్ రాంజీ అంబేద్కర్ ఒక ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కర్త. ఇతను దళితుల పై అంటరానితనాన్ని, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేశాడు. స్వాతంత్ర్య భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ శిల్పి అని 1990 లో భారత ప్రభుత్వం అత్యున్నత భారత రత్న పురస్కారాన్ని ఇతనికి మరణాంతరం ప్రకటించింది. భారతదేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిన నాయకుడు.ఇతను చేసిన విశేష కృషికి ఇతని పుట్టినరోజును ''అంబేడ్కర్ జయంతి'' గా జరుపుకుంటారు.అని అంబేద్కర్ ప్రత్యేకంగా దళిత సమస్యల పరిష్కారానికి ఆలిండియా డిప్రెస్డ్ క్లాస్ కాంగ్రెస్, ఆలిండియా షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ వంటి అనేక రాజకీయ పార్టీలను ఏర్పాటు చేసి దేశవ్యాప్తముగా దళితులను సమీకరించే ప్రయత్నమూ చేసాడు. ఈ సందర్భములో క్విట్ ఇండియా ఉద్యమం, ఆ తరువాత దేశ విభజనతో కూడిన స్వాతంత్ర్యము రావడం జరిగింది. రాజ్యాంగ పరిషత్తు సభ్యుడిగా– మంత్రివర్గ సభ్యుడిగా అంబేద్కర్: రాజ్యాంగ పరిషత్తు సభ్యుడిగా అంబేద్కర్ విశేష శ్రమవహించి రాజ్యాంగం రచించటం ఆయన శేష జీవితంలో ప్రముఖమైన ఘట్టం. టి.టి కృష్ణమాచారి (కేంద్రమంత్రి) ఒకమారు రాజ్యాంగ పరిషత్తులో మాట్లాడుతూ 'భారత రాజ్యాంగ రచనా భారమంతా డా.అంబేద్కర్ మోయవలసి వచ్చింది. రాజ్యాంగ రచన అత్యంత ప్రామాణికంగా ఉంటుందనటంలో ఏలాంటి సందేహం లేదు' అన్నాడు. ముఖ్యంగా సాంఘిక సంస్కరణలకు. అంబేద్కర్ పెక్కు గ్రంథాలు వ్రాశాడు. 'ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ', 'ప్రావిన్షియల్ డీ సెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా', 'ది బుద్దా అండ్ కార్ల్ మార్క్స్', 'ది బుద్ధా అండ్ హిజ్ ధర్మ' ప్రధానమైనవి. ప్రసిద్ధ రచయిత బెవెర్లి నికొలస్ డాక్టర్ అంబేద్కర్ భారతదేశపు ఆరుగురు మేధావులలో ఒకరు అని ప్రశంసించాడు. మహామేధావిగా, సంఘసంస్కర్తగా, న్యాయశాస్త్రవేత్తగా,కీర్తిగాంచిన డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ 1956 డిసెంబరు 6 న మహాపరినిర్వాణంఈ చెందాడు. ఆయన ఆశయాలకు అనుకూలంగా కాంగ్రెసు పార్టీని ముందుకు తీసుకు వెళ్లాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్.ఎం.బాషా ,నీ దా కృష్ణా రావు,రమేష్‌కొండలు,నాగేంద్ర,రహిమాన్ కాజ,ఇమ్మని ఏలు,మాజీ కౌన్సిలర్ ఆర్. శ్రీనివాసరావు,నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాబాసాహెబ్ జయంతి ఉత్సవాలు




విజయవాడ, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి:భారత రత్న, రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ 130 జయంతి వేడుకలు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో ఘనంగా జరిగాయి. లక్ష్మీ టాకీస్ సెంటర్ లో ఉన్న బాబాసాహెబ్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ సమాజంలో పెరుగుపోయిన కుల, మత వివక్షతలపై పోరాడి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహామనిషి అంబేద్కర్ అన్నారు. అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. సమాజంలో అందరూ సమానమేనని సమసమాజ స్థాపనకు కృషి చేశారని కొనియాడారు. సమనత్వం కోసం కృషి చేయడమేకాక రాజ్యాంగంలో పొందుపరిచి సమానత్వ హక్కును కూడా కల్పించారని పేర్కొన్నారు. అణగారిని వర్గంలో జన్మించినా ఆయన కులాలకు అతీతుడన్నారు. కానీ ఈ మద్య కాలంలో ఆయనకు కూడా కులాన్ని ఆపాదిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని ప్రపంచంలో అత్యున్నతమైనదిగా తీర్చిదిద్దిన మేధావి అంబేద్కర్ అన్నారు. భారత మొదటి న్యాయశాఖామంత్రిగా చేసి ప్రజలకు సేవలు అందించిన మహోన్నత నాయకులు అంబేద్కర్ అని చెప్పారు. 32 ఏళ్ల వయసులో పదుల సంఖ్యలో డిగ్రీలను పూర్తి చేసిన ప్రపంచ మేధావి అంబేద్కర్ అని వివరించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74 ఏళ్లు దాటినా భారత ప్రజాస్వామ్యం ఇప్పటికీ చెక్కుచెదరక పోవడానికి ఆయన రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షులు ఇలియాస్ పాషా, 19వ డివిజన్ కార్పోరేటర్ కొల్లూరి అనిత, 16వ డివిజన్ కార్పోరేటర్ దింటకూర్తి సుధాకర్, ఎస్.సి సెల్ అధ్యక్షులు చిట్టూరి యువరాజ్, పట్టణ సెక్రటరీ జ్యోతిబాబు, జిల్లా ఎస్.సి సెల్ కార్యదర్శి బురక బాలాజీ, సంస్కృతిక విభాగం అధ్యక్షులు బొడ్డు నాగరాజు, జిల్లా రైతు అధ్యక్షులు గొపు సత్యనారాయణ, హౌసింగ్ మాజీ డైరెక్టర్ మారగాని పరబ్రహ్మం, లీగల్ సెల్ అధ్యక్షులు పుప్పాల ప్రసాద్, రూరల్ కార్యదర్శి రామకృష్ణ, టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి



నరసరావుపేట, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 130వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని ప్రదేశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకుంటున్నారు అని అన్నారు. రాజ్యాంగ నిర్మాత ఎవరు మర్చిపోకూడదని అన్నారు. ఆయన ఆశయాలను అందరం కలిసికట్టుగా ఆచరించాలని అన్నారు . ఈ కార్యక్రమంలో మల్లెల అశోక్ , పంగులూరి విజయ్ కుమార్ ,బొమ్మ బాబు ,జయరావు, , నేలటూరి మురళి,మార్కు, చల్లగుండ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబా సాహెబ్ 130వ జయంతి వేడుకలు



వేటపాలెం, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: నవభారత వికాసానికి బాటలు వేసిన దార్శనికుడు, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 130వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేటపాలెంలో గడియార స్థంభం సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ కె ఎల్ మహేశ్వరరావు మాట్లాడుతూ సర్వసమానత్వానికి కృషిచేసిన కారణజన్ముడు బాబా సాహెబ్. భారత సమాజానికి అత్యుత్తమమైన, పటిష్టమైన రాజ్యాంగాన్ని అందించిన మహోన్నతుడని, బడుగు బలహీన వర్గాలకు చేసిన మేలు మారువరానిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మార్పు గ్రిగొరీ, జిల్లా మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు చింత శేషుబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విఆర్ఓ సంఘ నాయకులు చేగుడి సురేష్ బాబు, ఉపాధ్యాయులు చొప్పరపు ఏసోబు, మార్పు చిన్న రోసయ్య, వైకాపా యూత్ అధ్యక్షులు ఎస్ మాథ్యుస్, మాజీ సర్పంచ్ సామ్యూల్లు, నాని, నాగేంద్రబాబు, సురేష్, అనిల్, అందే మనోజ్, నౌషాద్, సాయి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ 130వ జయంతి వేడుకలు





బాపట్ల ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి:భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ 130 వ జయంతి సందర్భంగా బాపట్ల లోనే స్నేహ ఆఫీస్ నందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి తదుపరి కేక్ కట్ చేశారు ఈ సందర్భంగా, పలువురు వక్తలు గడ్డం ఏలియా, కాగిత వరప్రసాద్, కాగిత సుందరదాసు, అమ్మిశెట్టి రమాదేవి, గురుజాల శ్రీనివాస్, తదితరులు మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందడం అంటే అద్దాల మేడలు, రంగు గోడలు కాదు పౌరుని నైతికభివృదే నిజమైన మన దేశ అభివృద్ధి అని నినదించి, సమాజ స్థాపన కొరకు రాజ్యాంగ రూపకల్పన చేసిన మహానుభావులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఆయనను ఈ ప్రపంచం ఎన్నటికీ మర్చిపోలేదని మర్చిపోదు అని కొనియాడారు... ఈ కార్యక్రమంలో బాపట్ల అంబేద్కర్ టీవీ ఫుల్ టైం డైరెక్టర్ గురుజాల శ్రీనివాస్, పొన్నూరు అంబేద్కర్ టీవీ ఫుల్ టైం డైరెక్టర్ అమ్మిశెట్టి రమాదేవి, బాపట్ల స్నేహ క్లబ్ ప్రెసిడెంట్ కాగిత సుందర్ దాస్, బాపట్ల స్నేహ క్లబ్ గౌర్నర్ కాగిత వరప్రసాద్, సిబ్బంది మహేష్ మోహన్ తదితరులు పాల్గొన్నారు

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలకు నెరవేరుద్దాం:డిటీసీ ఇ.మీరా ప్రసాద్

విజయవాడ,ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: సంపూర్ణ స్వేచ్ఛ ను, సమానత్వాన్ని, లౌకికత్వాన్ని, న్యాయాన్ని ప్రాథమిక హక్కులుగా పూర్తిస్థాయిలో పొందటంతో పాటు ప్రతి పౌరుడు దేశ సేవకు దేశాభివృద్ధికి పాటుపడేలా బాధ్యతలను కలిగి ఉండాలని డిటిసి ఇ మీరాప్రసాద్ అన్నారు.స్థానిక బందర్ రోడ్డు లోని డిటిసి కార్యాలయం ప్రాంగణంలో నిర్మించుకున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహానికి ఆయన జయంతి సందర్భంగా రవాణాశాఖ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ సురేష్ నేతృత్వంలో డా,, బీఆర్ అంబెడ్కర్ 130వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. ఈ వేడుకల్లో గుంటూరు డిటీసీ ఇ మీరాప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొని అంబేద్కర్ కు నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన సభలో డిటీసీ ఇ మీరాప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ న్యాయవాదిగా ఆర్థికవేత్తగా రాజకీయవేత్తగా సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా ఆయన పేరు ప్రపంచ స్థాయిలో చిరస్మరణీయంగా నిలిచిపోయిందని ఆయన అన్నారు. ఆశయాలను ఆచరణలో పెడితే మనిషి మహనీయుడవుతాడనన్న డా,, బీఆర్ అంబేద్కర్ మాటలు డిటీసీ గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో దేశాన్ని నడిపించడానికి రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేసి, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని రూపొందించిన ఘనత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కే దక్కిందని ఆయన వివరించారు. అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని యావత్ భారతావని ఆయన సేవలను కొనియాడారు తున్నారన్నారు. అటువంటి మహనీయుడును ఆదర్శంగా తీసుకొని ఆయన చూపిన బాటలో ప్రతి పౌరుడు ముందుకు అడుగులు వెయ్యాలని



డిటిసి కోరారు. రవాణాశాఖ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ సురేష్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒక కులానికి మతానికి చెందిన వారు కాదని, యావత్ భారతదేశంలో అన్ని కులాలు అన్ని వర్గాల వారికి ఆయన సొంతమని ఆయన అన్నారు, అందరిని సమతుల్యంతో చూస్తూ ప్రతివారికీ న్యాయం జరిగేలా రాజ్యాంగంలో రూపొందించడం జరిగిందని ఆయన తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు నడవాలని ఆయన కోరారు. రానున్న కాలంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని రవాణాశాఖ కార్యాలయాల్లో డా,, బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాలను ప్రతిష్టించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు నివాళులర్పించిన వారిలో ఆర్ టి ఓ కే రాంప్రసాద్, రవాణా శాఖ నాన్ టెక్నికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి మణికుమార్ జోనల్ అధ్యక్షులు యం రాజబాబు, టెక్నికల్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయరాజు, ఎస్టీ ఎస్సీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి డి ఎస్ ఎస్ నాయక్, విశ్రాంతి ఆర్టీవోలు జె రాజా రావు, కె వి సుబ్బారావు, మోటార్ వాహన తనిఖీ అధికారులు జి నాగమురళి, ఆర్ ప్రవీణ్, నాయుడు, నారాయణ రాజు, వివిఎస్ వివిఎస్ఆర్ నాయుడు ఉద్యోగులు ఉన్నారు.





## కోవిడ్ టీకా ఉత్సవం

పెనుగంచిప్రోలు 14ఏప్రిల్(ప్రజాపాలన)పెనుగంచిప్రోలు మండల పరిధిలోకోవిడ్ టీకా ఉత్సవంలో భాగం గా మండలంలోని శనగపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 130వ జయంతి వేడుకలను నిర్వహించిన మండల అధికా రులు, ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమా లవేసి కొబ్బరికాయ కొట్టిన పెనుగంచిప్రోలు ఎమ్మా ర్వో షాకీర్ నిషా బేగం, అనంతరం గ్రామంలోని 45 సంవత్సరాలు పైబడిన వారికి కువైడ్ టీకా ను వేసిన డాక్టర్ అనిల్ కుమార్, ఈ కార్యక్రమంలో పెనుగం చిప్రోలు వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు వూట్ల నా గేశ్వరరావు, పెనుగంచిప్రోలు ఎంపీపీ అభ్యర్థి మార్క పూడి.గాంధీ, ఎమ్మార్వో షాకీర్ నిషా బేగం, ఎం డి ఓ బి రాజు, డాక్టర్ అనిల్ కుమార్, గ్రామ సర్పంచ్ కేసర సైదులు,గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## డిజిపి కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

విజయవాడ, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి:భీమ్‌రావు రామ్‌జీ అంబేద్కర్ 130 వ జయంతి పురస్కరించుకొని మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో డిజిపి శ్రీ గౌతం సవాంగ్ ఐ పి ఎస్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్స్ అడిషనల్ డిజి శంకరబాత్ర బగ్చి, టెక్నికల్ సర్వీసెస్ డిఐజి పాలరాజు. లా అండ్ ఆర్డర్ డిఐజి రాజశేఖర్ బాబు, దిశ స్పెషల్ ఆఫీసర్ దీపికా పాటిల్ ఐ పి ఎస్ పలువురు అధి కారులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

## అందుబాటులోకి కోవిడ్ వ్యాక్సిన్





వేటపాలెం, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి: 45 సంవత్సరాల వయస్సు నిండిన వారందరికి కోవిడ్ అందుబాటులో ఉందని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ డాక్టర్ బి. మాధవీలత అన్నారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ వందిళ్ళపల్లి, వేటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో మండలంలోని దేశాయిపేట పంచాయతీ లక్ష్మీపురంలోని ఎంపీపీ స్కూలులో, రామన్నపేటలోని ఎంపీపీ స్కూలులో, వేటపాలెం లోని బీబీహెచ్ జూనియర్ కాలేజీలో బుధవారం కోవిడ్ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారన్నారు. ఈ నాలుగు సెంటర్లలో దాదాపుగా వెయ్యిమందికి పైగా ప్రజలకు వ్యాక్సిన్ అందజేశారన్నారు. ప్రస్తుతం కరోనా వైరస్ సెకండ్ వేవ్ విసృతంగా ఉందని, ప్రజలందరూ కోవిడ్ నిబంధనలు పాటించాలని, కోవిడ్ వ్యాక్సిన్‌పై అపోహలు వీడి అందరూ వ్యక్సిన్ వేయించుకోవాలని కోరారు. స్థానిక తహసీల్దార్ కె. ఎల్ మహేశ్వరరావు, ఎంపీడీఓ కె. నేతాజీ వ్యాక్సిన్ పంపిణీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వేటపాలెం, వందిళ్ళపల్లి వీ హెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎం. ప్రభాకరరావు, ఎస్. జయకుమార్, ఎంపీహెచ్ఈఓ పి. వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు బి ప్రసాదరావు, శ్రీనివాసరావు, పూర్ణకుమారి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలు



నందిగామ, ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి:డా.బి.ఆర్.అంబేద్కర్ 130వ,జయంతి సందర్భంగా స్థానిక నందిగామ గాంధీ సెంటర్లో వున్న అంబేద్కర్ విగ్రహానికి బి.ఎస్.పి.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ బచ్చ లకూర పుష్పరాజు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు.అనంతరం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీ ప్రత్తిపాటి సూర్యం అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పుష్పరాజు మాట్లాడుతూ ,అం బే ద్కర్ భారతదేశం ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా వుండాలని,కుల,మత ,వర్గ భేదాలులేని సమ సమా జం ఏర్పాటు కాలన్న అంబేద్కర్ ఆశయ సాధన కో సం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అయన కోరారు.ఈ కార్యక్రమంలో పార్లమెంటు కోఆర్డినేటర్ శ్రీ బంకా మహేష్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీప్రత్తిపాటి సూ ర్యం, సీనియర్ నాయకులు దాసరి కృష్ణ, కోశాధికారి శ్రీ గారపాటి నాగరాజు, చంద్రావు, బూరుగు వర్మ ,కోట నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## దళిత చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

నందిగామ ఏప్రిల్ 14, ప్రజాపాలన ప్రతినిధి:డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని నందిగామ గాంధీ సెంటర్ లో దళిత చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిగామ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు విచ్చే సి ఆయనకు మహానుభావుడికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపం చ మేధావి ఆయన దళితులకు ఆరాధ్య దేవుడు కాద ని ప్రపంచానికి దిక్సూచి అని అన్నారు ఆయన రాసి న రాజ్యాంగం మన దేశానికే కాక ప్రపంచానికి అన్నా రు అనంతరం మున్సిపల్ చైర్మన్ వరలక్ష్మి ప్రసంగిస్తూ అంబేద్కర్ లాంటి మహానుభావుడు స్ఫూర్తితో ప్రతి ఒక్కరు నడుచుకోవాలి అన్నారు ఈ కార్యక్రమంలో పెసర మల్లి శేఖర్ రావు పిఆర్టియు రాష్ట్ర ఉపాధ్య క్షు లు విశ్రాంత ఉపాధ్యాయులు అధ్యక్షత వహించారు వహించారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ వాదులు కోటా దేవదాసు తుళ్లూరు విశ్వేశ్వరరావు ఆర్టిఏ హ నుమంతరావు భాస్కర్ రావు కిన్నెర రవి తిరుమల చై తన్య కుమార్ ఆర్ ఆర్ టి తరులు పాల్గొన్నారు.

# విజయవాడలో అంబేద్కర్ 130వ జయంతి వేడుకలు






విజయవాడ మాచవరం యలిశల వారి వీధిలో 130వ అంబేద్కర్ గారి జయంతి వేడుకలు



130వ అంబేద్కర్ గారి జయంతి వేడుకలలో దళిత జాతి ఆణిముత్యం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పి మోకా సత్తిబాబు












# వివిధ ప్రాంతాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ 130వ జయంతి వేడుకల దృశ్యాలు






















డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ 130వ జయంతి వేడుకలలో
కృష్ణ జిల్లా ఉంగుటూరు సబ్ ఇనస్పెక్టర్










కృష్ణజిల్లా గూడూరు మండల అంబేద్కర్ కమిటీ ఆధ్వర్యంలో బాబాసాహెబ్ %ంతీ% బి ఆర్ అంబేద్కర్ 130వ జయంతి కార్యక్రమం గూడూరు సామాజిక హాస్పిటల్ లో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో అధ్యక్షులు గోపి నాగబాబు, సభ్యులు బేతాళ స్వామి, బేతి శివ, బడుగు వెంకట్,నలిగిలి కిరణ్, శ్యామకృష్ణ, డాక్టర్స్ మరియు సిబ్బంది పాల్గొని పళ్ళు పంచిపెట్టడం జరిగింది


## మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)

జై భీం,

మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?

**అయితే రండి, కదలి రండి**

బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయుతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,

Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004

E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at :SEHASAI PRINTERS, D. 3-88, CHANRA TEATRE, GOSALA MAIN ROAD PENAMALURU MANDAL, DIST KRISHNA , ANDHRAPRADESH.,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16,Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com